## ఉరి వేసుకొని ఆత్మహత్య



ప్రజాపక్షం/నిజాంపేట్ : మనస్తాపానికి గురై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా నిజాంపేట మండలం కల్వకుంట గ్రామంలో చోటుచేసుకుంది. ఈ మేరకు ఎస్ఐ రాజేష్ వివరాల ప్రకారం ఆదివారం గ్రామానికి చెందిన ప్రభాకర్ రెడ్డి (72) తన పాత ఇంటిలో దొతితో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి వద్ద లభించిన సూసైడ్ నోట్‌లో మద్యానికి బానిసై, కుటుంబాన్ని సంతోషంగా ఉంచలేక మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తన మరణానికి ఎవరు బాధ్యులు కారని రాసుకున్నాడు. మృతుడి భార్య బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి విచారణ ప్రారంభించినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

## ఈదురుగాలులకు ఇళ్లు ధ్వంసం



ప్రజాపక్షం/ నేరడిగొండః మండలంలో ఆదివారం కురిసిన ఈదురుగాలుల వానకు గోవింద్‌పూర్, తేజాపూర్ తదితర గ్రామాల్లో భారీ నష్టం వాటిల్లింది. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయని, గ్రామాలకు చెందిన రాథోడ్ నీలాబాయి, ఆడే సకారం, జాదవ్ భీమ్రావ్, ఆడే పరశురాంలకు చెందిన ఇళ్లు ధ్వంసమయ్యాయని గ్రామస్తులు తెలిపారు. బాధిత కుటుంబాలను నాగమల్యాల్, పీసర సర్పంచ్‌లు పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, బాధితులకు న్యాయం జరిగేలా పరిహారం అందిస్తామని భరోసా ఇచ్చారు.

## అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్ల పట్టివేత

ప్రజాపక్షం/మోర్తాడ్ : నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న 9 ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మోర్తాడ్ మండలంలోని శెట్పల్లి గ్రామం పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో చితా పోలీసులు రంగంలోకి దిగి శెట్పల్లి–పెద్దవాడ నుంచి అక్రమ ఇసుక తరలిస్తున్న ఏడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు అలాగే మోర్తాడ్ మండలంలోని ధర్మోరా గ్రామంలోని పెద్దవాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను చిత పోలీసులు పట్టుకొని మోర్తాడ్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు మోర్తాడ్ ఎస్ఐ రాము తెలిపారు. మోర్తాడ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాలలో ఎవరైనా అధికారుల అనుమతి లేనిదే ఇసుక తరలించినట్లయితే వాహనాలను సీజ్ చేయడమే కాకుండా కఠినమైన చర్యలు చేపడతామని ఎస్ఐ రాము తెలిపారు. ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఇసుక అవసరం ఉన్నవారు తప్పనిసరిగా అధికారుల అనుమతి తీసుకొని తీసుకెళ్లాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే వారు ఎవరైనా అధికారుల అనుమతితోనే ఇసుక, అలాగే మొరం తెప్పించుకోవాలని ఎస్సై రాము సూచించారు.

## రాజీ మార్గమే రాజ మార్గం...

### 20 న రెండవ జాతీయ లోక్ అదాలత్: ఎస్పి



ప్రజాపక్షం / నిర్మల్ రూరల్ః నిర్మల్ జిల్లాలోని చాలా మంది ప్రజల న్యాయ సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి భారత ప్రభుత్వ నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు, సద్వినియోగపర్చుకోవాలని జిల్లా ఎస్పి డా.జి.జానకీ షర్మిల పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కక్షిదారులు కోర్టు పరిధిలో ఉన్న వివిధ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందని జిల్లా ఎస్పి పేర్కొన్నారు. చాలా మంది ప్రజల న్యాయ సంబంధిత సమస్యలను త్వరితగతిన, తక్కువ ఖర్చుతో పరిష్కరించడానికి భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగపర్చుకోవాలని ఎస్పి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ ఈ నెల 20న జరిగే రెండవ జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో చిన్న చిన్న కేసులు, ట్రాఫిక్ చలానాలు, మైనర్ క్రిమినల్ కేసులు, సివిల్ డిస్పూట్లు వంటి వివాదాలు లోక్ అదాలత్ ద్వారా సులభంగా పరిష్కారం పొందవచ్చని తెలిపారు. న్యాయ స్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను తక్కువ సమయంలో ముగించుకోవచ్చన్నారు. అంతే కాకుండా, ఇది ఒక శాంతియుత పరిష్కార విధానం కావు, ఇరు పక్షాలు పరస్పర అంగీకారంతో సమస్యలు పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. కోర్టులో గల కేసులను త్వరగా పరిష్కారం చేసుకుని ఈ అవకాశాన్ని వినియోగంచుకోవాలని ఎస్పి సూచించారు.

## వృద్ధురాలు అదృశ్యం.. కేసు నమోదు



ప్రజాపక్షం/వెల్దుర్తి: మెదక్ జిల్లా వెల్దుర్తి మండల పరిధిలోని శేరిలా గ్రామానికి చెందిన వృద్ధురాలు అదృశ్యమైన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. శేరీల గ్రామానికి చెందిన చిన్నింగి వెంకమ్మ (80) శనివారం రాత్రి భోజనం చేసి నిద్రకు ఉపక్రమించారు. ఆదివారం ఉదయం కోడలు లక్ష్మి వెంకమ్మ ఉన్న గదికి వెళ్లి చూడగా ఆమె అక్కడ లేరు. వెంటనే పొరుగు వారికి తెలియజేసి చుట్టుపక్కల ప్రాంతాలన్నీ వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. ఈ ఘటనపై వెంకమ్మ కోడలు లక్ష్మి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని పోలీసులు తెలిపారు.

## గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు



ప్రజాపక్షం / భైంసా : కుబీర్ మండలంలోని సాంగ్వీ గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి 20 లక్షల రూపాయల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ తెలియజేశారు. గ్రామంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నూతన భవనాన్ని నిర్మించేందుకు ఈ నిధులు ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామ సర్పంచ్ భోజేందర్ తో పాటు నాయకులు ప్రొసీడింగ్ కాపీని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గ్రామస్తుల తరఫున ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

# బడుల్లో 'బాహ్యా' పరీక్షలు...

### విద్యా ప్రమాణాల మెరుగుకే విద్యాశాఖ కసరత్తు!



ప్రజాపక్షం / నిర్మల్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థి కనీసం రెండో తరగతి పాఠాన్ని కూడా ధారాళంగా చదవలేకపోతున్నాడు. కనీస గణిత సూత్రాలు, కూడికలు, తీసివేతలు తెలియక తలలు పట్టుకుంటున్నారు. కానీ పదో తరగతి వార్షిక ఫలితాలు చూస్తే మాత్రం నిర్మల్ జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఏటా అత్యధిక ఉత్తీర్ణత శాతాలు నమోదవుతున్నాయి. ఈ విరుద్ధమైన క్షేత్రస్థాయి పరిస్థితులే ఇప్పుడు పాఠశాల విద్యాశాఖ పాలకులను, ఉన్నతాధికారును తీవ్ర ఆలోచనలో పడేశాయి. ఈ నేపథ్యంలోనే అసలు లోపం ఎక్కడ జరుగుతోంది? చదవడం, రాయడం వంటి కనీస నైపుణ్యాలు లేని విద్యార్థులు 10వ తరగతి వరకు ఎలా వస్తున్నారు? వార్షిక పరీక్షల్లో ఎలా ఉత్తీర్ణులవుతున్నారు? అనే ప్రశ్నలు జిల్లా విద్యాశాఖ వర్గాల్లో బలంగా వ్యక్తమవుతున్నాయి. దీనికి పరిష్కారంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పూర్తిగా గాడిలో పెట్టేందుకు సరికొత్త విప్లవాత్మక మార్పులకు అడుగులు పడుతున్నాయి. ఇప్పటి వరకు పాఠశాలల పరిధులకే పరిమితమైన అంతర్గత పరీక్షల విధానానికి స్వస్తి పలికి, సర్కారు బడుల్లో సరికొత్త బాహ్య మూల్యాంకన విధానాన్ని ప్రయోగాత్మకంగా నిర్వహించాలని విద్యాశాఖ యోచిస్తోంది. ప్రభుత్వ పర్యవేక్షకుల ఆకస్మిక తనిఖీల తరహాలోనే, విద్యార్థులకు కూడా ఏలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఆకస్మికంగా పరీక్షలు నిర్వహించేందుకు ఉన్నత స్థాయి ప్రణాళికలు సిద్ధమతున్నాయి. ఇందుకు ప్రభుత్వ అంగీకారం కోరగా, అంతా సవ్యంగా కుదిరితే వచ్చే విద్యా సంవత్సరం నుంచే ఈ నూతన పరీక్షల విధానం అమలు కానుంది.

### ప్రస్తుత అంతర్గత విధానంలో లోపాలు..

ప్రస్తుతం జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిరంతర సమగ్ర మూల్యాంకన విధానం అమలులో ఉంది. ఇందులో భాగంగా విద్యార్థులు చదువుతున్న పాఠశాల ఉపాధ్యాయులే వారి ప్రతిభను పరీక్షిస్తూ వివిధ రకాల అంతర్గత సామర్థ్య పరీక్షల పేరుతో మార్కులు వేస్తున్నారు. అయితే ఈ విధానం వల్ల ఆశించిన ఫలితాలు రావడం లేదని, ఉపాధ్యాయులు తమ పాఠశాలల ఫలితాలను ఎక్కువగా చూపించుకునేందుకు మార్కులు ఎక్కువగా వేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల విడుదలైన జాతీయ సాధనా సర్వే నివేదికలు కూడా సర్కారు బడుల్లో విద్యా ప్రమాణాల క్షీణతను స్పష్టంగా కళ్లకు కట్టాయి. తాము చదువుతున్న ప్రస్తుత తరగతి పాఠాలే కాకుండా, ఐదారేళ్ల క్రితం ప్రాథమిక తరగతుల్లో నేర్చుకోవాల్సిన భాషా జ్ఞానాన్ని కనీస గణితాంశాలను సైతం విద్యార్థులు మర్చిపోతున్నట్లు ఆ సర్వేలో వెల్లడైంది. ఇలాంటి పరిణామాలు విద్యార్థులు భవిష్యత్తును దెబ్బ తీస్తాయని, ఇప్పుడే సరైన చర్యలు తీసుకోకపోతే విద్యా ప్రమాణాలు మరింత దిగజారుతాయని విద్యా శాఖ తీవ్ర ఆందోళన చెందుతోంది.

### ఏటా రెండుసార్లు ఆకస్మిక పరీక్షలు..

విద్యాశాఖ ప్రతిపాధించిన కొత్త బాహ్య మూల్యాంకన విధానం పూర్తి పారదర్శకంగా, నిష్పాక్షికంగా, అత్యంత కఠినంగా సాగనుంది. దీని ప్రకారం ప్రతీ విద్యా సంవత్సరం విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాన్ని పరీక్షించడానికి రెండుసార్లు ఈ బాహ్య పరీక్షలను నిర్వహిస్తారు. అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఈ పరీక్షల నిర్వహణలో సదరు పాఠశాల ఉపాధ్యాయులకు ఏలాంటి ప్రమేయం గానీ, జోక్యం గానీ ఉండదు. యాదృచ్ఛిక పద్ధతిలో ఇతర పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను ఈ పరీక్షల నిర్వహణకు పర్యవేక్షకులుగా పంపుతారు. ఏ సబ్జెక్టు పరీక్ష, ఏ రోజు, ఏ సమయానికి జరుగుతుందనే విషయాలను అత్యంత గోప్యంగా ఉంచుతారు. జిల్లా స్థాయి పర్యవేక్షక బృందం ఆకస్మికంగా బడికి చేరుకుని ప్రశ్నపత్రాలను అందించి పరీక్ష నిర్వహిస్తుంది. దీనివల్ల విద్యార్థులు నిరంతరం చదువుపై శ్రద్ధ పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. పరీక్షల నిర్వహణతోనే సరిపెట్టకుండా, విద్యార్థులు రాసిన జవాబు పత్రాల మూల్యాంకనంలోనూ విద్యాశాఖ కఠినమైన నిబంధనలను తీసుకురానుంది. పరీక్షలు పూర్తయిన వెంటనే ఆ జవాబు పత్రాలను సేకరించి, మరో పాఠశాల ఉపాధ్యాయులతో మూల్యాంకనం చేయిస్తారు. ఆయా సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు వచ్చిన మార్కులను వెనువెంటనే పాఠశాల విద్యా శాఖకు చెందిన అధికారిక అంతర్జాలంలో పొందుపరుస్తారు. దీని ద్వారా ఏ పాఠశాలలోని విద్యార్థులు ఏయే సబ్జెక్టుల్లో, ఏయే అంశాల్లో వెనుబడ్డారో ఉన్నతాధికారులకు స్పష్టమైన అవగాహన వస్తుంది. ఆ లోపాలను సరిదిద్దేందుకు, విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు వెనువెంటనే ప్రత్యేక తరగతులు, ఉపాధ్యాయులకు ప్రత్యేక బోధనా శిక్షణను నిర్వహిస్తారు.

## నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాపక్షం / నర్సాపూర్ (జి) : నర్సాపూర్ (జి) మండలంలోని అంజనీ, నర్సాపూర్‌జి, గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు స్థానిక బిజెఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మధ్యాహ్నం 3 గంటలకు శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు, క్యాంపు కార్యాలయం నుంచి సమాచారం అందించారు. ఈ కార్యక్రమానికి భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

# కార్మిక ఉద్యమ యోధుడు 'మునీర్'

### మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి



ప్రజాపక్షం / మందమర్రి : కార్మిక హక్కుల కోసం జీవితాంతం పోరాడిన సీనియర్ జర్నలిస్టు, తెలంగాణ ఉద్యమకారుడు మునీర్ సేవలు అపూర్వమని రాష్ట్ర కార్మిక, గనులు, ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి కొనియాడారు. మందమర్రి పట్టణంలోని సిఇఆర్ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన 'మునీర్ భాయ్ – ప్రొలిటేరియన్' జర్నలిస్టు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ ప్రజా నాయకుడు ప్రొ. కోదండరామ్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదేలు హాజరయ్యారు. అంతకుముందు ము నీర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మునీర్‌తో తనకు ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. జర్నలిస్టుగా మాత్రమే కాకుండా కార్మికుల గొంతుకగా, సామాజిక చైతన్యవేత్తగా, ఉద్యమ స్ఫూర్తిగా ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో సింగరేణి జెఎసి చైర్మన్‌గా వేలాది మంది కార్మికులను ఏకతాటిపైకి తీసుకువచ్చి ఉద్యమ విజయానికి కీలకంగా దోహదపడ్డారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను కలం తో వెలుగులోకి తీసుకువచ్చిన మునీర్, కార్మిక వర్గ హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడిన యోధుడని వక్తలు అభివర్ణించారు. ఆయన జీవితం నేటి యువ జర్నలిస్టులకు, ఉద్యమకారులకు ఆదర్శమని పేర్కొన్నారు. ఈ పుస్తకం ద్వారా మునీర్ జీవన ప్రస్థానం, ఉ ద్య మ చరిత్ర, జర్నలిజంలో ఆయన చూ పిన నిబద్ధత భావితరాలకు చేరువవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్మిక లోకానికి అంకితమైన మునీర్ సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ప్రజా నాయకుడు ప్రొ. కోదండరామ్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదేలు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## గంజాయి వినియోగంపై స్నిఫర్ డాగ్ నిఘా




ప్రజాపక్షం/ నేరడిగొండః ఆదిలాబాద్ జిల్లా ఎస్పి అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు మండలంలో ఈగల్ టీమ్, నేరడిగొండ పోలీసులు ఆదివారం ముమ్మర తనిఖీలు చేపట్టారు. గంజాయి వినియోగదారులు, అనుమానితులను లక్ష్యంగా చేసుకుని స్నిఫర్ డాగ్ (జాగిలం) సహాయంతో నేరడిగొండ, వదుర్ గ్రామాల్లోని పరిసర ప్రాంతాలతో పాటు ఆర్‌టిసి బస్సుల్లో తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఎస్ఐ ఇమ్రాన్ ఖాన్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల కట్టడి కోసం నిరంతరం జాగిలాలతో నిఘా ఉంటుందన్నారు. ఎవరైనా మాదకద్రవ్యాలు వినియోగిస్తే ఈ జాగిలాలు ఇట్టే కనిపెడతాయని, ఎవరూ కూడా గంజాయి వంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడవద్దని సూచించారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# భీమ్‌గల్ అభివృద్ధి పనులపై కాంగ్రెస్ నిర్లక్ష్యం

### నెల రోజుల్లో ప్రారంభించకుంటే ప్రజల పక్షాన బిఆర్ఎస్ పార్టీ పోరాడుతుంది
### మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



ప్రజాపక్షం/భీమ్‌గల్ : బిఆర్ఎస్ హయాంలో భీమ్‌గల్ పట్టణ అభివృద్ధి కోసం మంజూరు చేసిన నిధులు నిలిచిపోయిన పనుల స్థితిగతులపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన బిఆర్ఎస్ నాయకులతో కలిసి పట్టణంలోని పలు అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం, పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌పై విమర్శలు గుప్పించారు. ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ కెసిఆర్ ప్రభుత్వ హయాంలో భీమ్‌గల్ పట్టణ రూపురేఖలు మార్చటానికి రూ.100 కోట్ల నిధులు మంజూరు చేయించామని గుర్తు చేశారు. రూ.22 కోట్ల ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం, నిరుపేదలకు నాణ్యమైన వసతులు అందించేందుకు రూ.22 కోట్లతో మార్కెట్ భవన పనులు ప్రారంభించి రూ.16 కోట్ల పనులు పూర్తి చేయించామన్నారు. కాంట్రాక్టర్‌కు రూ.13 కోట్ల నిధులు కూడా విడుదల చేశామని, కానీ మిగిలిన పనులను పూర్తి చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర సంవత్సరాల సమయం తీసుకుందని మండిపడ్డారు.

**మహేష్‌కుమార్‌గౌడ్‌కు సవాల్ :** మున్సిపల్ ఎన్నికల సమయంలో పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ రూ.5కోట్ల నిధులు మంజూరు చేస్తానని మాటిచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా పైసా విదిల్చలేదని, ఆయనకు తాను సవాల్ విసురుతున్నా న్నారు. ఓడినా, గెలిచినా బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన పోరాడుతుందని ఎమ్మెల్యే వేముల స్పష్టం చేశారు

# రక్తదానం సామాజిక బాధ్యత

### ఎమ్మెల్యే పాల్వాయి హరీష్



ప్రజాపక్షం / కాగజ్ నగర్ః రక్తదాతలే ప్రాణదాతలని, రక్తదానం చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని సిర్పూర్ ఎంఎల్ఏ పాల్వాయి హరీష్ బాబు అన్నారు. కాగజ్ నగర్ పట్టణంలోని అగ్రసేన్ భవన్‌లో మార్వాడి యువ మంచ్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అవసరమైన సమయంలో రక్తదానం చేయడం వల్ల అనేక మంది ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఏడాదిలో కనీసం రెండుసార్లు రక్తదానం చేసేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. రక్తదానం వల్ల దాతకు ఎలాంటి నష్టం ఉండదని, సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. అనంతరం రక్తదానం చేసిన వారిని సన్మానించి మొమెంటోలు అందజేశారు. ఈ శిబిరంలో పెద్ద సంఖ్యలో యువత పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప పోలీస్ సూపరింటెండెంట్ వహీదుద్దీన్, సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రేమ్ కుమార్, డాక్టర్ కృష్ణారావు, శివ గౌడ్, మురళీ కృష్ణ జవర్, కపిల్ సోనీ, శుభం లోయ, అభిషేక్ సోనీ, హితేష్ అగర్వాల్, వివేక్ బజాజ్, గోవింద్ అసావా పాల్గొన్నారు.

## జులై 19న ఏఐటియుసి జిల్లా మహాసభలు




ప్రజాపక్షం/ఆదిలా–బాద్ రూరల్ః వచ్చే నెల జూలై 19న ఏఐటియుసి ఆదిలాబాద్ జిల్లా మహాసభలను నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ తెలిపారు. హైదరాబాద్‌లోని ఏఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్ అధ్యక్షతన, రాష్ట్ర ఇంచార్జి వీఎస్ బోస్ ముఖ్య అతిథిగా ఆదివారం రాష్ట్ర సమితి అత్యవసర సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా నివేదికను ప్రవేశపెట్టిన అనంతరం సిర్ర దేవేందర్ మాట్లాడుతూ జిల్లా మహాసభల్లో అన్ని రంగాల కార్మికులకు సమాన పనికి సమాన వేతనం, ఇతర సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ సభలను జయప్రదం చేయడం ద్వారా సెప్టెంబర్ 6,7,8 తేదీలలో కరీంనగర్‌లో జరిగే 4వ రాష్ట్ర మహాసభల విజయవంతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం. నర్సింహా, ఎస్. విలాస్, ప్రేమ్ పావని, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# యాప్‌లో యూరియా మాయం..రైతుల ఆగ్రహం




ప్రజాపక్షం / పెంచికల్‌పేట్ : యాప్‌లో యూరియా స్టాక్ నిమిషాల వ్యవధిలోనే మాయం కావడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలంలో యూరియా ఎరువుల పంపిణీ వ్యవహారం రైతుల్లో తీవ్ర అసంతృప్తికి దారితీసింది. మండలానికి యూరియా వచ్చిన సమాచారం రైతులకు ముందస్తుగా తెలియజేయకుండా, కొందరికి మాత్రమే చేరుతోందని ఆరోపిస్తున్నారు. యాప్‌లో బుకింగ్ ప్రారంభమైన కొద్ది క్షణాల్లోనే స్టాక్ ముగిసిందని చూపించడం వెనుక అసలు కారణాలపై వ్యవసాయ శాఖ అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. విత్తనాలు వేసే కీలక సమయంలో ఎరువులు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ సంబంధిత అధికారులు సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టడం లేదని ఆరోపిస్తున్నారు. కొంతమంది వ్యాపారులు రైతుల పేర్లతో యూరియా బుక్ చేసుకుని, అనంతరం అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో యూరియా బ్యాగ్‌పై నిర్ణీత ధర కంటే ఎక్కువ మొత్తాన్ని వసూలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. యూరియా స్టాక్ వివరాలను ముందుగానే బహిరంగంగా ప్రకటించాలని, ప్రతి పట్టాదారు రైతుకు న్యాయంగా యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. యాప్ బుకింగ్ వ్యవస్థపై సాంకేతిక, పరిపాలనా విచారణ జరిపి, బ్లాక్ మార్కెట్, అధిక ధరల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. యూరియా పంపిణీలో పారదర్శకత లేకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారనే ఆరోపణల నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

# 60 ఏళ్లలో ఓటు, సీటు చోరీ చేసింది కాంగ్రెస్ పార్టీనే

### శాసనసభను రద్దు చేసి ఎన్నికలకు రండి
### బిజెపి 8 మంది ఎంపీలు రాజీనామాకు సిద్ధం
### సిఎం రేవంత్‌కు ఎంపి రఘునందన్ సవాల్



ప్రజాపక్షం/మెదక్ : భారతదేశ రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత ఓటు, సీటు చోరీ, జవహర్ లాల్ నెహ్రూను ప్రధానిని చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కిందని, ఓటు, సీటు కోసం చరిత్ర చదివితే రేవంత్‌రెడ్డికి తెలుస్తుందని చదువు రాని ఆయనకి ఏం తెలుస్తుందని మెదక్ ఎంపి రఘునందన్ రావు విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని తూట్లు పొడిచిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని ఎద్దేవా చేశారు. 4339 రోజుల ప్రధానమంత్రి పదవీకాలం పేద ప్రజల విశ్వాసం, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న మోదీ పాలనకు నిదర్శనమని స్పష్టం చేశారు. ఆదివారం మెదక్ బిజెపి కార్యాలయంలో రాష్ట్ర అధికార ప్రతినిధి చికోటి ప్రవీణ్, జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేశం గౌడ్, మాజీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌తో కలిసి ఎంపి రఘునందన్‌రావు విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని మండిపడ్డారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై సిఎం రేవంత్ రెడ్డి చేసి వ్యాఖ్యలపై శాసనసభను రద్దు చేసి ఎన్నికలకు వస్తే బిజెపికి చెందిన 8 మంది ఎంపిలు రాజీనామా చేయడానికి సిద్ధమని సిఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. ధాన్యం సకాలంలో కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, సిఎం ఢిల్లీ పర్యటనలు, కాంగ్రెస్‌లో కుర్చీల పోరాటమే ఎక్కువగా కనిపిస్తున్నాయని ఎద్దేవా చేశా రు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో అభివృద్ధి వేగంగా సాగుతోందని పేర్కొన్న రఘునందన్ రావు, జాతీయ రహదారులు, రైతు సంక్షేమ పథకాలు, జనధన్ ఖాతాల ద్వారా దేశం పురోగతి సాధించిందన్నారు. ప్రజల ఆశీస్సులతో బిజెపి మరింత బలోపేతం అవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు అఖిల భరత్, రాజమణి, సర్పంచ్ జెండే వీణ, నాయకులు కవితారెడ్డి, రాములు, ఎంఎల్ఎన్ రెడ్డి, రంజిత్ రెడ్డి, బిక్షపతి, జనార్ధన్, సురేష్ తదితరులు ఉన్నారు.

## ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలి

### టియుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ లచ్చిరాం డిమాండ్

ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ : నిర్మల్ జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టియుటిఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ లచ్చిరాం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యోగ ఉపాధ్యాయుల మే నెల వేతనం నుండి 1.5 శాతం ఇహెచ్ఎస్ చందా వసూలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు మార్గదర్శకాలు రూపొందించకపోవడం శోచనీయమన్నారు. వెంటనే అన్ని కార్పొరేట్ ఆసుపత్రులలో అమలయ్యే విధంగా ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో ఈ నెల 30 తేదీ లోపు రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని వస్తున్న వార్తల పట్ల ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 1:9 విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండాలని 60 మంది విద్యార్థులకు ఐదుగురు ఉపాధ్యాయులు ఉండాలని, ఆపైన ప్రతి 20 మందికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తోడిశెట్టి రవికాంత్, వహీద్ ఖాన్, రాష్ట్ర సహాధ్యక్షులు ఎ.లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శరత్ చందర్‌రెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షుడు ముత్తన్న జిల్లా కోశాధికారి, మేడారపు శ్రీనివాస్, నాయకులు ఎస్.పాండురంగాచారి, పోల దర్మరాజ్ పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ శంకర్‌కు ఉత్తమ శాస్త్రవేత్త అవార్డు



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయంలో పని చేస్తున్న ప్రధాన శాస్త్రవేత్త పెద్దపల్లి జిల్లా తేలుకుంట గ్రామ వాసి డా.మేకల శంకర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఉత్తమ ప్రతిభ శాస్త్రవేత్త అవార్డు అందుకున్నారు. నేలల ఆరోగ్య విభాగం, సహజ వనరులు, పర్యావరణ కేంద్రం రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం 62వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రతిష్టాత్మకమైన డా బిఆర్ అంబేద్కర్ ఉత్తమ ప్రతిభ శాస్త్రవేత్త అవార్డును రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సమక్షంలో జస్టిస్ సుదర్శన్ రెడ్డి, ప్రొఫెసర్ మధుర స్వామినాథన్ చేతులమీదుగా డా. మేకల శంకర్‌కు అందించారు. అవార్డు అందుకున్న శంకర్ కు రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు అభినందలు తెలిపారు. కాగా అవార్డు అందుకున్న డా. మేకల శంకర్ కు జిల్లాలోని పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

## బాండ్లు ఉన్నా.. అందని నిధులు

### నిరుపయోగంగా మారిన బాలికా సంరక్షణ పథకం



**ప్రజాపక్షం/ముత్తారం :** పేద కుటుంబాల్లో పుట్టిన ఆడపిల్లల చదువు, వివాహ ఖర్చుల కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హయాంలో 2005 ప్రవేశపెట్టిన ''కొత్త బాలికా సంరక్షణ పథకం''(జిసిపిఎస్) ప్రస్తుతం లబ్ధిదారులకు శాపంగా మారింది.చిన్నారుల పేరిట ప్రభుత్వం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ద్వారా జారీ చేసిన బాండ్లు మెచ్యూరిటీ గడువు ముగిసినప్పటికీ,సంబంధిత నిధులు చేతికి అందడం లేదని పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం పరిధిలోని పలు గ్రామాల బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇదే విషయంపై ఐసిడిఎస్ సూపర్వైజర్ స్వప్న ని వివరణ కోరగా బాలిక సంరక్షణ పథకం గతంలో బుక్కులు ఉండేవని తర్వాత వచ్చిన ఎల్ఐసి బాండ్లకు సంబంధించిన నిధులు రావడంలేదని సిడిపిఒఅధికారి జిల్లా అధికారుల దృష్టికి తీసుకుపోవడం జరిగిందన్నారు. వీటికి సంబంధించిన నిధులు మంజూరు కాగానే బాలిక సంరక్షణ పథకం లబ్ధిదారులకు రావలసిన నిధులను వారికి అందే విధంగా చూడడం జరుగుతుందన్నారు.

## నకిలీ విత్తనాలు, ఎరువులపై అధికారులు ప్రత్యేక దృష్టి

**ప్రజాపక్షం/బెజ్జంకి:** నకిలీ విత్తానాలు,ఎరువులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి రైతులకు నాణ్యమైన ఉత్పత్తులను అందించాని అఖిల భారత యువ జన సమాఖ్య (ఎఐవైఎఫ్) మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్ అన్నారు.ఆదివారం వారు మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు సాగుకు సిద్ధమవులున్న తరునంలో మార్కెట్లో నకిలీ విత్తనాలు,ఎరువులు,విక్రయమవుతాయని దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని అన్నారు.అందువల్ల సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఫర్టిలైజర్ దుకాణాలను క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసి నాణ్యత ప్రమాణాలు పాటించని షాపులపై చట్టపరమైనా ఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## ఇంటి పన్నుల మోత తీరకముందే చెత్త పన్నుల మోత..!



**ప్రజాపక్షం/చొప్పదండి :** చొప్పదండి పట్టణ కేంద్రంలో ఆదివారం ఐక్య కార్యచరణ సమితి సభ్యుల సమావేశం స్థానిక రెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐకాస సభ్యులు మాట్లాడుతూ మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న చొప్పదండి మున్సిపాలిటీ చేసి అధిక పన్నుల భారం మోపి పన్నులు కట్టలేని పరిస్థితుల్లో ఉన్న ప్రజలకు కొత్తగా చెత్త పన్ను పేరున ఇంటింటికీ రూ.50, దుకాణాలకు రూ.150 వసూలు చేయాలని ఒక ప్రైవేట్ ఏజెన్సీకి కాంట్రాక్ట్ ఇవ్వడం సరికాదని ఇది ప్రజలపై అదనపు భారం వేయడమే తప్ప మరొకటి కాదని అన్నారు. తక్షణమే పట్టణ సమస్యలు పరిష్కరించి ఇలాంటి నిర్ణయాలు ప్రజావేదిక ద్వారా తెలియజేయాలని లేనియెడల ఐకాస ఆధ్వర్యంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐకాస నాయకులు గుర్రం ఇంద్రసేనా రెడ్డి, ఎన్నం మునీందర్, కొమ్ముల రమణరెడ్డి, కొక్కుల రామ్మోహన్, గుర్రం మల్లారెడ్డి, చెల్లిపెల్లి కిషన్, గుర్రం రవీందర్ రెడ్డి, మారంపెల్లి నాగభూషణం, మోలుమూరి రాజేశం, తిక్క శివశంకర్ ఈశ్వర్, చిలుకూనూరి మహేశ్, శ్రీనివాస్ రెడ్డి, కోటగిరి ప్రశాంత్, గుండ వీరారెడ్డి, శ్రీనివాస్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## గల్ఫ్ బాధితులకు అండగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**ప్రజాపక్షం /కొడిమ్యాల :** ప్రమాదవశాత్తు దుబాయ్ లో రోడ్డు ప్రమాదంలో మరణించిన కొడిమ్యాల మండలం నమిలికొండ గ్రామానికి చెందిన సయ్యద్ సలీమ్ మల్యాల మండలం తక్కలపల్లి గ్రామానికి చెందిన గొల్లపల్లి తిరుపతి గౌడ్ మృతదేహాలను దుబాయ్ వెళ్లి దగ్గరుండి తీసుకరావడమే కాకుండా ఎయిర్‌పోర్ట్ నుండి ప్రత్యేక అంబులెన్సు ద్వారా వారి స్వగృహానికి తీసుకొచ్చి వారి కుటుంబ సభ్యులకు అందజేసి తక్షణ సహాయం క్రింద 20,000/ చొప్పున దహన సంస్కారాల నిమిత్తం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రభుత్వం పరంగా అన్ని విధాల ఆదుకుంటాం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచ్లు పాల్గొన్నారు.

# మరింత భద్రతకే కొత్త పోలీస్ స్టేషన్లు

### నూతన పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకు స్థలాల పరిశీలన
### ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** జిల్లాలో నూ తన పోలీస్ స్టేషన్ల ఏర్పాటు కోసం ప్రతిపాదించిన స్థలాలను ప్రభుత్వ విప్ శాసనసభ్యుడు చింతకుంట విజయ రమణారావు ఆదివారం పరిశీలించారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష,రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూతో కలిసి ఎలిగేడు మండలంలో ఏర్పాటు చేయనున్న నూతన పోలీస్ స్టేషన్‌కు ప్రతిపాదించిన స్థలాన్ని, పెద్దకల్వల లోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేయనున్న నూతన పోలీస్ స్టేషన్ స్థలాన్ని,పెద్దపల్లి లోని వ్యవసాయ మార్కెట్ లోని మహిళా పోలీస్ స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేయనున్న నూతన పోలీస్ స్టేషన్ స్థలాన్ని, పెద్దపల్లి లోని బంధంపల్లి గ్రామంలో ఏర్పాటు చేయనున్న రూరల్ పోలీస్ స్టేషన్ స్థలాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ ప్రజలకు మరింత మెరుగైన భద్రతా సేవలు అందించేందుకు నూతన పోలీస్ స్టేషన్ల ఏర్పాటు అవసరమని తెలిపారు. పోలీస్ స్టేషన్ల నిర్మాణానికి సంబంధించి అనువైన స్థలాల ఎంపికపై సమగ్ర నివేదికను సోమవారం సాయంత్రం లోపు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.నూతన పోలీస్ స్టేషన్ల ఏర్పాటు ద్వారా ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువవుతాయని, శాంతిభద్రతల పరిరక్షణలో ఇది కీలకంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాష్ రావు, పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి. గంగయ్య, పోలీస్ అధికారులు,సంబంధిత శాఖలఅధికారులు,పాల్గొన్నారు.

## రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన

### కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్
### రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం/ వేములవాడ:** వేములవాడ నియోజకవర్గం లోని బొల్లారం నుండి సిరికొండ వరకు చేపట్టనున్న ఈ రహదారి విస్తరణ పనులకు 23 కోట్ల రూపాయల వ్యయంతో కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్. రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ. గత రాష్ట్ర ప్రభుత్వం వేరు, ప్రస్తుత ప్రభుత్వం వేరు అని.కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ అభివృద్ధి పనులతో ప్రాంతీయ రవాణా సౌకర్యాలు మెరుగుపడి ప్రజలకు మరింత సౌలభ్యం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి నాయకులు చెన్నమనేని వికాస్ రావు, ప్రతాప రామకృష్ణ, ఎర్రం మహేష్, శ్రీనివాస్, రాపల్లి శ్రీధర్,బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెట్‌పల్లిలో వెలుగులోకి భారీ మోసం

### తహసీల్దార్ సంతకం ఫోర్జరీ కేసులో
### నలుగురు నిందితుల అరెస్టు

**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** మెట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయ సంతకం, అధికారిక ముద్రలను ఫోర్జరీ చేసి నకిలీ పత్రాలు తయారు చేసిన కేసులో నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.గత నెలలో తహసీల్దార్ మెట్‌పల్లి సంతకాన్ని ఫోర్జరీ చేసి, కార్యాలయ అధికారిక ముద్రలను నకిలీగా తయారు చేసి వాటి ఆధారంగా నకిలీ పత్రాలు సృష్టించి, ఆరపేట శివారులోని సర్వే నెం.191/ఈలో గల 8 గుంటల భూమిని తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించినట్లు తహసీల్దార్ మెట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశా రు.ఇట్టి కేసులో జగిత్యాల ఎస్పి అశోక్ కుమార్ ఆదేశాల మేరకు మెట్‌పల్లి డిఎస్పి రాములు పర్యవేక్షణలో మెట్‌పల్లి సిఐ సురేష్ బాబు, ఎస్ఐ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ప్రత్యేక బృందంగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో మొత్తం ఆరుగురు నిందితులను గుర్తించగా, వారిలో నలుగురు నిందితులు — రాజుల దేవి నర్సయ్య, కలికోట వేణు, లోలపు గణేష్, పాకాల రాకేష్ — ను అరెస్టు చేశారు.నకిలీ పత్రాల తయారీకి ఉపయోగించిన కంప్యూటర్, ఇతర పరికరాలు, రబ్బరు స్టాంపులను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన నిందితులను కోర్టులో మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు.దర్యాప్తులో నిందితులు రాజుల దేవి నర్సయ్య, కలికోట వేణు, లోలపు గణేష్, బెజ్జారపు మధుసూదన్, పాకాల రాకేష్, అంగారి శంకర్ పరస్పరం కుమ్మక్కై నేరానికి పాల్పడినట్లు వెల్లడైంది. ఆరపేట శివారులోని సర్వే నెం.191/ఈలో వివాదాస్పద భూమిని విక్రయించేందుకు కుట్ర పన్నినట్లు తేలింది.భూమికి ఆబాది సర్టిఫికేట్ జారీ చేయడానికి తహసీల్దార్ కార్యాలయం నిరాకరించినప్పటికీ, డాక్యుమెంట్ రైటర్ పాకాల రాకేష్ తన కంప్యూటర్‌లో నకిలీ ఆబాది సర్టిఫికేట్ తయారు చేసి సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అంగారి శంకర్ నకిలీ అధికారిక స్టాంపులు తయారు చేసి నేరానికి సహకరించినట్లు తెలిసింది. ఈ నకిలీ ఆబాది సర్టిఫికేట్ ఆధారంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బెజ్జారపు మధుసూదన్ పేరుపై భూమి రిజిస్ట్రేషన్ జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారంలో రాజుల దేవి నర్సయ్య, కలికోట వేణు, లోలపు గణేష్, బెజ్జారపు మధుసూదన్ ఆర్థిక లాభం పొందినట్లు విచారణలో వెల్లడైంది.ప్రజలు భూముల కొనుగోలు సమయంలో సంబంధిత ప్రభుత్వ రికార్డులు, ధ్రువపత్రాలను తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని పోలీసులు సూచించారు. ప్రభుత్వ పత్రాలను ఫోర్జరీ చేయడం, నకిలీ ధ్రువపత్రాలు తయారు చేయడం లేదా వినియోగించడం వంటి నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## నేరెల్లలో భారీ చోరీ



**ప్రజాపక్షం/ధర్మపురి :** ఇంటికి తాళంవేసి కు టుంబంతో యజమాని తీర్థ యాత్రలకు వెళ్లిన సమయంలో అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తు లు చొరబడి 7 తులాల బంగారం ఆభరణాలు, 12 తులాల వెండి, రూ.1.10 లక్షల నగ దు దొంగిలించుకు పోయిన సంఘటన నేరెల్ల గ్రామంలో చోటు చేసుకొంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.,జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలోని నేరెల్ల గ్రామ జాతీయ రహదారి పక్కనే ఉన్న మామిడిపెల్లి గోపాల్ మూడు రోజుల క్రితం భార్య పిల్లలతో కలిసి తీర్థ యాత్రలకై వెళ్లాడు. ఇంటికి తాళం వేసి ఉన్నదని గమనించిన గుర్తు తెలియని దుండగులు శనివారం అర్ధరాత్రి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న 7 తులాల బంగారు ఆభరణాలు, వాటిలో ఒక టిన్నర తులాల బంగారు గొలుసు, 4 తులాల బంగారం నక్లెస్, 2 తులాల కమ్మలు బుట్టాలు రూ.1.10 లక్షల నగదును అపహరించుకుపోయినట్లు తెలిపారు. ఆదివారం ఉదయం యజమాని తమ్ముడు మామిడిపెల్లి సత్తయ్య ఇంటికి వెళ్లి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని వస్తువులు చిందర వందరగా పడి ఉన్నాయని తెలిపారు. ముందుగా తన తమ్ముడు గోపాల్ కు చోరీ సంఘటన గురించి తెలిపి ఆ తరువాత పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి ఎస్ఐమహేష్,సిబ్బంది చేరుకొని అన్నికోణాలలో పరిశీలించారు.

## గుంతల రోడ్లు... ప్రజల ప్రాణాలతో ఆట



**ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం:** ఇబ్రహీంపట్నం మండల కేంద్రంతో పాటు గోదూరు, వర్షకొండ గ్రామాలకు వెళ్లే ప్రధాన తారు రహదారులు గుంతలమయంగా మారి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. గత నెలలోనే ప్రజాపక్షం రోడ్ల దుస్థితిని వెలుగులోకి తెచ్చినా సంబంధిత అధికారులు ఇప్పటి వరకు శాశ్వత మరమ్మతులు చేపట్టలేదు.అధికారులు నామమాత్రంగా చేపట్టిన ప్యాచ్‌వర్క్ పనులు కొద్ది రోజులకే లేచిపోవడంతో మళ్లీ భారీ గుంతలు బయటపడ్డాయి. దీంతో వాహనదారులు, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. రాత్రి వేళల్లో ప్రమాదాల భయం మరింత పెరిగింది. ఇదే రోడ్డు వెంట ఇటీవలే కొద్ది రోజుల క్రితం భార్యాభర్తలు ద్విచక్ర వాహనంపైన వస్తుండగా గుంతలు ఏర్పడక రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాల పాలై హాస్పిటల్ బారిన పడ్డారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఈ రోడ్ల వెంబడి గుంతలు ఏర్పడక వాహనదారులు ప్రమాదాల బారిన పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి.మరికొద్ది రోజుల్లో వర్షాకాలం ప్రారంభం కానుండటంతో గుంతలు నీటితో నిండిపోయి ప్రమాదాలు మరింతపెరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి తాత్కాలిక ప్యాచ్‌వర్క్‌లకు బదులుగా శాశ్వత మరమ్మతులు చేపట్టి రహదారులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని మండల ప్రజలు,వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

## వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేయించి వెంటనే ప్రారంభించండి

### సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు తొడుపునూరి రమేశ్ కుమార్ డిమాండ్



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి ఆర్జీ వన్ ప్రభావిత ప్రాంతమైన జనగామ డివిజన్ ప్రజలకు శుద్ధి చేసిన త్రాగునీటిని అందించేందుకు గత కొన్ని సంవత్సరాల క్రితం అర్జీవన్ యాజమాన్యం ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్, ప్రారంభించకముందే శిథిలావస్థకు చేరుకుందని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తొడుపునూరి రమేశ్ కుమార్ తెలిపారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి జనగామలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసినా,అది ప్రారంభం కాకముందే పాడైపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి యాజమాన్యం సి.ఎస్.ఆర్ నిధుల కింద ప్రభావిత ప్రాంతాల్లో కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని ప్రకటనలు చేస్తుందని, కానీ ఆచరణలో ప్రజలకు ఉపయోగపడే ప్రాథమిక సౌకర్యాలు కూడా అందడం లేదని ఆయన విమర్శించారు. ఈ వాటర్ ప్లాంట్ శిథిలావస్థకు చేరుకోవడం యాజమాన్య నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని డివిజన్ ప్రజలు అభిప్రాయపడుతున్నారని రమేశ్ కుమార్ అన్నారు. కనుక సింగరేణి యాజమాన్యం వెంటనే నిధులు కేటాయించి వాటర్ ప్లాంట్‌కు అవసరమైన మరమ్మతులు చేపట్టి, డివిజన్ ప్రజలకు సురక్షితమైన శుద్ధి చేసిన త్రాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిచో ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## మున్నూరు కాపుల అభివృద్ధికి డిజిటల్ సర్వే కీలకం



**ప్రజాపక్షం/గంగాధర :** మున్నూరు కాపు సమాజ సమగ్ర అభివృద్ధి, ఐక్యత, పరస్పర సహకారానికి డిజిటల్ కుటుంబ సర్వే కీలకంగా మారనుందని చొప్పదండి నియోజకవర్గ మున్నూరు కాపు ఇంచార్జ్ మడ్లపల్లి శ్రీనివాస్ పటేల్ , జర్నలిస్టు ఫోరం జిల్లా అధ్యక్షుడు వెల్పుల శ్రీనివాస్ పటేల్‌లు పేర్కొన్నారు. తెలంగాణ మున్నూరు కాపు జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కొత్త లక్ష్మ ణ్ పటేల్ ఆధ్వర్యంలో రూపొందించిన డిజిటల్ యాప్ కుటుంబ సర్వే పోస్టర్‌ను ఆదివారం గంగాధర మం డ లం కొండయ్యపల్లి గ్రామంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రెండ్ల రాజిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రె ండ్ల వెంకన్న, సంఘం అధ్యక్షుడు గోపు గంగరాజు, రాచమల్లు సుగుణాకర్ పటేల్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ ప్రగతికి ఖచ్చితమైన గణాంకాలు అత్య ంత అవసరమని సర్వే ద్వారా సామాజిక, ఆర్థిక విద్యా పరిస్థితులపై సమగ్ర సమాచారం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ప్రతి కుటుంబం స్వచ్ఛందంగా ఈ సర్వేలో పాల్గొని జ యప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మున్నూరు కాపు సమాజంలోని విద్యావంతులు, వైద్యులు, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, యువతను ఒకే డిజిటల్ వేదికపైకి తీసుకురావడమే ఈ యాప్ ప్రధాన లక్ష్యమన్నారు. యువతకు విద్య, ఉపాధి, పోటీ పరీక్షలు, వ్యాపార అవకాశాలపై మార్గదర్శకత్వం అందించడంలో ఇది కీలక పాత్ర పోశిస్తున్నారు. డిజిటల్ యాప్ కార్యక్రమాన్ని కరీంనగర్ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభిస్తున్నామని అనంతరం రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన కాపు కుటుంబ సభ్యులు, యువకులు, సంఘం నాయకులు రేండ్ల శంకరయ్య పటేల్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## మల్లికార్జున గుడిలో హుండీ చోరీ

**ప్రజాపక్షం/ముత్తారం:** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం పారుపల్లి గ్రామంలోని శ్రీ ఆది మల్లికార్జున స్వామి గుడిలో శనివారం రాత్రి ఘోరమైన చోరీ జరిగింది. గుర్తుతెలియని దు ర్మార్గులు దేవుని హుండీ తాళాలు పగలగొట్టి అందులోని నగదునంతా ఎత్తుకపోయారు. ఆదివారం ఉదయం ఈ దారుణా న్ని చూసిన స్థానిక ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యా రు.రాత్రి పూట గుడిలో ఎవరూ లేని సమయాన్ని ఆసరాగా చే సుకుని దొంగలు ఈ నీచమైన నేరానికి తెగబడ్డారు. పొద్దుగాల గుడికి వచ్చిన పూజారి, భక్తులు పసుపు రంగు ఇనుప హుండీ పగిలి ఉండటం చూసి ఖంగుతిన్నారు. వెంటనే ఊరిలోని కుల పెద్దలకు కబురు పెట్టారు. గుడి వద్దకు హుటాహుటిన చేరుకున్న పెద్దలు పగిలిన హుండీని పరిశీలించగా., అందులోని నగదు మొత్తం అప్పటికే మాయమైపోయింది.దేవుని గుడిలోనే ఇంతటి ఘోరానికి ఒడిగట్టడంపై స్థానిక కులస్తులు, భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పవిత్రమైన దేవుని సొమ్మును కాజేసిన ఆ పాపాత్ములను వదిలిపెట్టే ప్రసక్తే లేదని మండిపడుతున్నారు. ఆ దొంగలు ఎక్కడ దాక్కున్నా సరే వెతికి పట్టుకొని తీరాలని, భవిష్యత్తులో ఎవరూ ఇలాంటి నేరం చేయకుండా వారికి కఠినంగా బుద్ధి చెప్పాలని కుల పెద్దలు, ఊరి భక్తులు ముక్త కంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

## బిఆర్ఎస్ నాయకుల ఆరోపణలు శుద్ధ అబద్ధం

### కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు
### చొప్పదండి ప్రకాష్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** వేములవాడ శాసనసభ్యుడు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఇచ్చిన హామీలు నెరవేరుస్త లేడని బిఆర్ఎస్ నాయకులు చేసిన ఆరోపణలు శుద్ధ అబద్ధమని సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ బదులిచ్చారు. ఆదివారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో సమావేశం నిర్వహించి బిఆర్ఎస్ నాయకులు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గత ప్రభుత్వంలో కెసిఆర్ ఏడాదికి రాజన్న ఆలయానికి వందకోట్ల నిధులు ఇస్తానని విస్మరించారని అన్నారు. ఆది శ్రీనివాస్ రాజన్న ఆలయాన్ని ఆధ్యాత్మికంగా మాట ఇవ్వకుండా అభివృద్ధి చేస్తున్నారని 150 కోట్లతో రాజన్న ఆలయ అభివృద్ధి, రోడ్డు వెడల్పు కార్యక్రమం చేపడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోనే సిరిసిల్ల నేతన్నలను ఆదుకున్నది మరిచిపోయారా అన్నారు. బతుకమ్మ చీరల పేరిట నాణ్యత లేని చీరలు పంపిణీ చేశారని విమర్శించారు. ఎలక్షన్ల ముందు సిరిసిల్ల నేతన్నలకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించలేదని మండిపడ్డారు. ఆ బకాయిలను మళ్లీ మా ప్రభుత్వమే చెల్లించింది అన్నారు. సిరిసిల్ల నేతన్నలకు పని దొరకాలని నాణ్యమైన ఇందిరా మహిళ శక్తి చీరల ఆర్డర్లను ఇచ్చారన్నారు. ఈ రెండున్నర సంవత్సరాలలో ఎన్నో పథకాలను అమలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడానికి కార్యకర్తలు సమాయత్తంతో పని చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను, దేశంలో ఎక్కడ లేని విధంగా సన్న బియ్యం పంపిణీ చేస్తూ దేశంలోనే రోల్ మోడల్ గా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సభ్యులు బొద్దుల శ్రీనివాస్ నాయకులు ఆకునూరి బాలరాజు, లింగంపల్లి గంగరాజు,కూరపాటి శ్రీశైలం,ఆడెపు ప్రభాకర్, యెల్లె లక్ష్మీ నారాయణ, కుడిక్యాల రవికుమార్, గొల్లపెల్లి పరుశురాములు, నక్క నరసయ్య, ఇరుకుళ్ళ భాస్కర్, గుజ్జే రమేష్ తదితరులు పాల్గొన్నారు

## 18న కరీంనగర్ జిల్లాలో కల్వకుంట్ల కవిత పర్యటన



**ప్రజాపక్షం / కరీంనగర్ :** తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈనెల 18 న కరీంనగర్ జిల్లాలో పర్యటిస్తున్నట్లు జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ తెలిపారు. కరీంనగర్ నియోజకవర్గంలో జెండా పండుగ కార్యక్రమంతోపాటు రౌండ్ టేబ్ల్ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు హరిప్రసాద్ తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కల్వకుంట్ల కవిత పాల్గొని వివిధ అంశాలను చర్చించడం జరుగుతుందని ముఖ్యంగా తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పని చేసిన తెలంగాణ ఉద్యమకారులతో, రాష్ట్ర సాధనలో పనిచేసిన మేధావులతో ఇలా కవులు, కళాకారులతో సమాలోచనలు చేసి భవిష్యత్‌లో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధితోపాటు తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకోవడం కోసం అన్ని వర్గాల ప్రజలతో కలిపి ఈ రౌండ్ టేబ్ల్ సమావేశంలో చర్చించడం జరుగుతుందని హరిప్రసాద్ పేర్కొన్నారు.



## మైనర్ల రక్షణలో మహిళా పోలీసుల కీలకం

పోక్సోచట్టంపై మహిళా కానిస్టేబుళ్లకు అవగాహన

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** మైనర్ బాలికలను రక్షించడంలో మహిళ పోలీసుల పాత్ర చాల కీలకమైనదని హుజూర్‌నగర్ సిఐ చరమందరాజు అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని మహిళ కానిస్టేబుళ్లకు ఫోక్సో చట్టంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. సర్కిల్ ఇన్స్‌పెక్టర్ చరమందరాజు, ఎస్ఐ నరేష్ లు హాజరై దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా సిఐ మాట్లాడుతూ పోక్సో చట్టంలోని నిబంధనలను క్షుణంగా అవగాహన చేసుకుని క్షేత్రస్థాయిలో బాలికలకు చట్టాలపై చైతన్యం కల్పించాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులకు పోలీస్ భరోసా కార్యక్రమం ద్వారా భద్రత అంశాలు, ఆపదలో ఉన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. అంతేకాకుండా పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మహిళ కానిస్టేబుళ్లు ఎలా వ్యవహరించాలి, బాధితులకు ఫిర్యాదులను స్వీకరించేటప్పుడు పాటించాల్సిన మర్యాదపూర్వక పద్ధతులు, జనరల్ డైరీ ఎంట్రీలు నమోదు చేయడం, ప్రజలతో మమేకమైవారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం వంటి అంశాలపై పలు సూచనలు చేశారు. సమాజంలో బాధ్యతయుతమైన పోలీస్ సిబ్బందిగా పనిచేస్తూ, మమిళలు, బాలికల రక్షణకు ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాజ్యాంగ విలువలను మంటగల్పుతున్న బిజెపి ప్రభుత్వం

బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



**ప్రజాపక్షం/కోదాడ:** దేశంలోని అన్ని వర్గాల హక్కుల పరిరక్షణకు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగ విలువలను కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి కుట్రలు, కుతంత్రాలతో మంటగల్పుతుందని అందుకు సాక్షి భూతంగా అనేక ఉదహరణలు ఉన్నాయని బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం కోదాడ ఎఆర్ఆర్ ఫంక్షన్ హల్‌లో ప్రత్యేక ఓటర్ బాధ్యత, పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదుపై నిర్వహించిన నియోజకవర్గ విస్తృత సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రంలో సర్ పేరుతో కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలు కలిసి ప్రతిపక్ష పార్టీల ఓట్లు తొలగించేందుకు కుట్రలకు తెరలేపాయని విమర్శించారు. ఇప్పటి వరకు దేశంలో ఐదు రాష్ట్రాల్లో సర్ ప్రక్రీయ జరిపితే పశ్చిమబెంగాల్ కేరళ, పాండిచ్చేరి తమిళనాడులలో లక్షల ఓట్లు తొలగించి, బిజెపి అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. బిజెపి అధికారంలో ఉన్న అస్సాం రాష్ట్రంలో మాత్రం సర్ నిర్వహించలేదని ఆరోపించారు. 2028లో జరగబోయే ఎన్నికల్లో ఎలాగైన అధికారంలోకి రావాలనే ఉద్దేశ్యంతోనే కాంగ్రెస్, బిజెపిలు కుమ్మక్కై తెలంగాణలో ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీకి సంబంధించిన ఓట్లు తొలగించాలని కుట్ర చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, మిర్యాలగూడెం మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ అనుమతి లేని కెఎన్ఎమ్ వంగడాల సాగుతో రైస్ ఇండస్ట్రీకి తీవ్ర నష్టం

మార్కెట్ డిమాండ్ ఉన్న సన్న రకాలపైనే రైతులు దృష్టి పెట్టాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మార్కెట్‌లో ధర తగ్గించి విక్రయించినా వినియోగదారులు కొనేందుకు ముందుకు రాని కేఎన్ఎమ్ 12510 రకం వరి ధాన్యాన్ని ప్రస్తుత సీజన్ లో కొనుగోలు చేసే పరిస్థితి లేదని అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్నాటి రమేష్ అన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడుతూ తక్కువ రోజుల్లో పంట చేతికి వస్తుందనే ఉద్దేశంతో సాగు చేస్తున్న కేఎన్ఎమ్ రకంలో వైట్ బెల్ట్ ఎక్కువగా ఉండి, వండేటప్పుడు అన్నం నాణ్యత దెబ్బతింటోందని మార్కెట్ వర్గాల ద్వారా తేలిందన్నారు. వ్యవసాయ అధికారులు ధృవీకరించని ఇటువంటి విత్తనాలను విక్రయించడం వల్ల గత సీజన్ లో ధాన్యం కొన్న మిల్లుల యాజమాన్యాలు ఆర్థికంగా నష్టపోయారని గుర్తు చేశారు. రైతులు మిల్లర్ల ఇబ్బందులను గమనించి, మార్కెట్ లో మంచి అమ్మకాలు సాగుతున్న జై శ్రీరామ్, జెఎస్ఆర్, హెచ్ఎంటి, చింట్లు రకాల వైపు మొగ్గు చూపడం వల్ల అన్ని రంగాలకు మేలు జరుగుతుందని ఆకాంక్షించారు. రైతులు సమగ్ర అవగాహనతో నాణ్యమైన సన్న రకాలనే పండించి తమకు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వెంకటరమణ చౌదరి (బాబి), వైస్ ప్రెసిడెంట్ గోళ్ళ రామశేఖర్, సెక్రటరీ పోలిశెట్టి ధనుంజయ, ట్రెజరర్ గందె రాము, జిల్లా నేత డాక్టర్ బండారు కుశలయ్య, రైస్ మిల్లుల అధినేతలు జైయినిమురళి, లిమిటెడ్ రేపాల అంతయ్య, ఇనుగుర్తి మోహన్ రావు, గుడగంట్ల గణేష్, గార్లపాటి మధు, గార్లపాటి మట్టపల్లి, గుంటి గోపి, ఇల్లందుల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## తోటి కూలీ కుటుంబానికి అండగా ఉపాధి కూలీలు

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం వెల్మజాల గ్రామానికి చెందిన వర్రె అయిలమల్లు ఉపాధి హామీ కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. జూన్ 04వ తేదిన రోజు వారిగానే ఉపాధి హామీ పనులకు వచ్చిన అయిలమల్లు మధ్యాహ్నా సమయంలో ఎండ తీవ్రతతో చాతిలో నొప్పి కారణంగా ఇంటికి వెళ్ళాడు ఇంటికి వెళ్ళిన కొద్దిసేపటికే అయిలమల్లు మరణించడం జరిగింది. ఆదివారం తోటి ఉపాధి హామీ కూలీలు అయిలమల్లు ఇంటికి వచ్చి వారి కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపి అయిలమల్లు భార్య కవితకు రూ. 10వేలను ఆర్థిక సాయంగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కూలీ సంఘం నాయకులు చంద్రయ్య, వికలాంగుల హెల్పింగ్ సొసైటి ఫౌండర్ రమేష్, శ్రమ మిత్ర సహయకుడు పురుషోత్తం, మేట్స్ మాధవి, శ్వేత, రేణుక, రజిని, సుజాత తదితరులు ఉన్నారు.

# శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమం

**లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి: ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పిలుపు**




**ప్రజాపక్షం/నల్లగొండ:** కేంద్ర పాలకులు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబించడం వల్ల మారిన కార్మిక చట్టాల నేపథ్యంలో శ్రమ దోపిడీ పెరుగుతుందని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి తెలిపారు. ఆదివారం నల్లగొండలోని ఏఐటియుసి జిల్లా కార్యాలయం జరిగిన సంఘం జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలక వర్గాలు కార్పొరేట్ శక్తులకు తొత్తుగా మారాయని అనేక దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న హక్కులు ఇప్పుడు కనుమరుగై మోడీ సర్కార్ కబంధ హస్తాల్లో చిక్కుకున్నాయని ఆయన ఆరోపించారు.ఎన్‌డిఏ పాలనలో కార్మిక హక్కులు హరించబడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.కార్మిక చట్టాల సవరణ పేరుతో యాజమాన్యాల క్రింద కార్మికులు బానిసలుగా పనిచేయాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. మోడీకి కార్పొరేట్ల రక్షణ తప్ప కార్మిక సంక్షేమం తెలియదని ఆయన తెలిపారు.44 కార్మిక చట్టాలను సవరణ చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకు రావడం కార్మికులకు శాపంగా మారాయని అన్నారు.పాలకులు అవలంబిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుంతుంటే అదుపు చేయడంలో పాలకులు విఫలమయ్యారని, ధరలు పెరగడం వల్ల కార్మికులు మధ్యతరగతి వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గత ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం కార్మిక వర్గానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. జులై 19వ తేదీన నల్లగొండ జిల్లా ఏఐటీయూసీ మహాసభ గుర్రంపోడ్‌లో జరుగుతుందని అన్నారు. ఈ సమావేశానికి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి అధ్యక్షత వహించగా జిల్లా ఉపాధ్యక్షులు కె ఎస్ రెడ్డి,పాణెం వెంకట రావు సహాయ కార్యదర్శులు దోటి వెంకన్న, వెంకటేష్,నరసింహ,అమీర్,వి లెనిన్, వెంకట్రాములు,ఎండి జానీ పెదనర్సింహ,బెల్లం శివయ్య,ఏ మల్లయ్య పాల్గొన్నారు.

## బిఎల్ఒల పాత్ర అత్యంత కీలకం

ఓటర్ జాబితా సవరణలో అప్రమత్తంగా ఉండాలి

బిఎల్ఒలకు దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి



**ప్రజాపక్షం/కోదాడ:** ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటర్ వెన్నముక అని, ప్రతి అర్హుడైన వ్యక్తి ఓటర్ జాబితాలో పేరు నమోదు అయ్యేలా పార్టీ శ్రేణులు అప్రమత్తంగా వ్యవహరించాలని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కోదాడ పట్టణంలోని గునుగుంట్ల అప్పయ్య ఫంక్షన్‌హల్‌లో టిపిసిసి ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 2026 శిక్షణ శిబిరంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బూత్ లెవల్ ఏజెంట్లు మార్గదర్శనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ జాబితా సవరణలో ప్రక్రీయలో బిఎల్‌వోల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. బూత్ పరిధిలో కొత్తగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతి, యువకులు వలస వెళ్లి తిరిగి వచ్చిన కుటుంబాలు తదిత వివరాలను గుర్తించి వారి పేర్లు జాబితాలో నమోదు చేయించి బాధ్యతను పార్టీ కార్యకర్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లిపోయిన వారు పేర్ల తొలగింపుపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ప్రజల ఓటు హక్కును పరిరక్షించేందుకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని, ఓటర్ జాబితాలో ఎలాంటి తప్పులు, లోపాలు లేకుండా ప్రతి బూత్ స్థాయిలో, క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలు, దరఖాస్తుల ప్రక్రీయ, ఫారంల వినియోగం, అభ్యంతరాల నమోదు తదితర అంశాలపై శిక్షణలో నిపుణులు బిఎల్‌వోలకు అవగాహన కల్పించారు. ఈ శిక్షణ శిబిరంలో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎమ్మెల్యే రామమోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, టిపిసిసి డెలికేట్ చింతకుంట్ల లక్ష్మి నారాయణరెడ్డి, కొలిశెట్టి బుచ్చిపాపయ్య, కొప్పుల జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రజా ఉద్యమాలకు సుబ్బారావు జీవితం మార్గదర్శకం



మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రజా హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువల సాధన కోసం జీవితాంతం పోరాడిన ప్రముఖ మానవ హక్కుల ఉద్యమకారుడు, విద్యావేత్త, సామాజిక చైతన్యవేత్త పి. సుబ్బారావు సేవలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి నిరంతరం పోరాడిన అరుదైన వ్యక్తిగా పి. సుబ్బారావు గుర్తింపు పొందారని పేర్కొన్నారు. మిర్యాలగూడలోని కళాభారతి ఎన్ఎస్పీ క్యాంపులో ఆదివారం నిర్వహించిన పి. సుబ్బారావు సంస్మరణ సభలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. మానవ హక్కుల వేదిక ఉమ్మడి నల్లగొండ జిల్లా కమిటీ, ప్రజాసంఘాలు, ఆయన శిష్యులు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అక్కెనపల్లి వీరస్వామి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పి.సుబ్బారావు జీవితం సమాజానికి ఒక పాఠశాల వంటిదని అన్నారు. విద్యార్థి దశ నుంచే హేతువాద భావజాలం, ప్రజాస్వామ్య ఆలోచనలు, సామాజిక న్యాయం పట్ల నిబద్ధతతో ముందుకు సాగారని గుర్తు చేశారు. ఉపాధ్యాయునిగా, లెక్చరర్‌గా వేలాది మంది విద్యార్థులకు విద్యాబోధన చేయడంతో పాటు సామాజిక బాధ్యతను కూడా నేర్పారని తెలిపారు.అమరావతిలో జన్మించిన పి. సుబ్బారావు 1956లో మిర్యాలగూడకు వచ్చి విద్యా రంగంలో సేవలు ప్రారంభించారు. అనంతరం ప్రజా సమస్యలపై స్పందిస్తూ అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారు. పర్యావరణ పరిరక్షణ, దళితుల హక్కులు, గిరిజనుల సమస్యలు, రైతాంగ అంశాలపై ఆయన చేసిన పోరాటం విశేషమని ఎమ్మెల్యే కొనియాడారు. ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ వ్యతిరేక ఉద్యమం, యురేనియం తవ్వకాల వ్యతిరేక పోరాటం, సారా వ్యతిరేక ఉద్యమాల్లో ఆయన ముందుండి పోరాడారని తెలిపారు. బూటకపు ఎన్‌కౌంటర్లపై నిజ నిర్ధారణ కమిటీల ద్వారా బాధితులకు న్యాయం చేయడానికి కృషి చేశారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ సి.డి. రవికుమార్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గుడిపాటి శిరీషనవీన్, మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి తిరుపతి, రాష్ట్ర నాయకులు గోసుల మోహన్, ప్రజా సంఘాల నాయకులు, మేధావులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని పి. సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

## పాఠశాలలు పునఃప్రారంభం అమావాస్య ఎఫెక్ట్

నేడు పిల్లల్ని స్కూల్‌కు పంపుతారా...?

లేదా సెంటిమెంట్‌తో తల్లిదండ్రుల్లో సందిగ్ధం

స్కూళ్లు తెరుచుకుంటున్నా..హాజరుపై అనుమానాలు




**ప్రజాపక్షం/నల్లగొండ :** తెలంగాణలో వేసవి సెలవులు ముగియడంతో సోమవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి.వాస్తవానికి ఈ నెల 12వ తేదీతోనే సెలవులు ముగియాల్సి ఉండగా,రాష్ట్రంలో కొనసాగిన ఎండల తీవ్రత కారణంగా ప్రభుత్వం సెలవులను జూన్ 15 వరకు పొడిగించింది. దీంతో విద్యార్థులు మళ్లీ బడిబాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు.అయితే ఈసారి స్కూళ్ల ప్రారంభంపై కొందరు తల్లిదండ్రుల్లో సందిగ్ధ పరిస్థితి నెలకొంది. సోమవారం అమావాస్య రోజు కావడం,ఆతర్వాత రోజు మంగళవారం కావడంతో పిల్లలను వెంటనే స్కూల్‌కు పంపాలా వద్దా అనే ఆలోచనలో పలువురు పేరెంట్స్ ఉన్నారు. సంప్రదాయ విశ్వాసాలను అనుసరించే కుటుంబాలు బుధవారం నుంచి పిల్లలను పాఠశాలలకు పంపాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.మరోవైపు విద్యాశాఖ మాత్రం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే సోమవారం నుంచి అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ప్రారంభం కానున్నాయని స్పష్టం చేసింది.కొత్త విద్యా సంవత్సరానికి అవసరమైన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.కొంతమంది తల్లిదండ్రులు పిల్లలు మొదటి రోజు నుంచే తరగతులకు హాజరవ్వాలని భావిస్తుండగా, మరి కొందరు శుభదినం చూసి పంపాలని నిర్ణయించుకుంటున్నారు.దీంతో పాఠశాలల మొదటి రోజు హాజరు శాతం ఎలా ఉంటుందనే అంశం ఆసక్తికరంగా మారింది.సెంటిమెంట్‌లకు ప్రాధాన్యత ఇచ్చే తల్లిదండ్రుల నిర్ణయం ఒకవైపు,విద్యా సంవత్సరాన్ని మొదటి రోజు నుంచే ప్రారంభించాలనే ఆలోచన మరోవైపు ఉండటంతో రేపటి నుంచి స్కూళ్లలో విద్యార్థుల హాజరుపై చర్చ జరుగుతోంది.

# మోగిన బడిగంటలు



**వేసవి సెలవుల తరువాత బడిగంటలు మోగాయి. పుస్తకాలను సంచుల్లో సర్దుకొని భుజాన వేసుకుని సరికొత్త ఉత్సాహంతో విద్యార్థులు బడిబాట పట్టారు. వేసవి సెలవులతో వెలవెలబోయిన పాఠశాలల్లో విద్యార్థుల రాకతో సరికొత్త శోభ సంతరించుకుంది.**

**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట జిల్లాలో మొత్తం 1,209 పాఠశాలలు ఉండగా ఇందులో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 939 ఉండగా 18 కెజిబివి, 9 మోడల్, 1 యుఆర్ఎస్, 242 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. 1లక్ష 14వేల మంది పైగా విద్యార్థులు విద్యనభ్యసించనుండగా ప్రైవేట్ పాఠశాలల్లోనే దాదాపు 60వేల మంది ఉన్నారు. ఇందులో సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, తిరుమలగిరి, నేరేడుచర్ల మున్సిపాల్టిల పరిధిలోని అత్యధికంగా ప్రైవేట్ విద్యాసంస్థలు ఉండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు అంటూ ప్రభుత్వ పాఠశాలలకు పంపకుండా ప్రైవేటు చదువుల వైపు మొగ్గు చూపుతున్నారు. పేద, మధ్య తరగతి వారు కూడా ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అప్పులు చేసి చదివిస్తున్న పరిస్థితి.

**స్వాగత తోరణాలతో పాఠశాలలు ముస్తాబు**

వేసవి సెలవులతో దాదాపు 50 రోజులపాటు మూసివేసిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు సెలవులు ముగియటంతో తెరుచుకున్నాయి. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు స్వాగతం పలికేందుకు అధికారులు పాఠశాలల ప్రవేశ ద్వారాల ముందు మామిడి తోరణాలు, కొబ్బరి మట్టలు, అరటి ఆకులను కట్టి ముస్తాబు చేశారు. గత రెండు మూడు రోజుల నుండే తరగతి గదులు, బల్లాలను శుభ్రం చేయగా ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు తరగతి గదులకు రంగులు వేసి ముస్తాబు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠశాల ప్రారంభం రోజునే పాఠ్య పుస్తకాలతోపాటు నోట్‌బుక్స్‌ను అందజేయనున్నట్లు విద్యాశాఖ అధికారులు ముందే వెల్లడించారు.

**ప్రైవేటుకు అమావాస్య అడ్డు...**

ప్రైవేట్ పాఠశాలల పునఃప్రారంభానికి అమావాస్య అడ్డు వచ్చింది. సోమవారం (నేడు) అమావాస్య ఉండడం, మరుసటి రోజు మంగళవారం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు మంచి రోజులు లేకపోవడంతో తమ పిల్లలను పాఠశాలలకు పంపేందుకు ఆసక్తి చూపరని యాజమాన్యాలు నిర్ణయానికి వచ్చాయి. దీంతో కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఈనెల 17వ తేదీన పాఠశాలలను పునఃప్రారంభించనున్నట్లు ప్రకటించాయి.

## భక్త మార్కండేయ స్వామి ఆలయ నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/నాంపల్లి:** మండల కేంద్రంలోని భక్త మార్కండేయ స్వామి దేవాలయంలో ఆదివారం గ్రామ సర్పంచ్ నక్క చంద్రశేఖర్, దేవాలయ మాజీ చైర్మన్ కోట రఘునందన్ , కుల పెద్దల సమక్షంలో దేవాలయ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈకమిటీలో గౌరవ వ్యవస్థాపక కమిటీ అధ్యక్షుడిగా నక్క భువనేశ్వర్, అధ్యక్షుడిగా సంగెపు గణేష్,ఉపాధ్యక్షుడిగా పిల్లల మర్రి కిరణ్ కుమార్,ప్రధాన కార్యదర్శిగా గంజి సంజీవ్, కోశాధికారిగా తిరందాసు లక్ష్మణ్,కార్యదర్శులుగా కర్నాటి సాంబశివ, రుద్ర వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులుగా వింజమూరి సురేందర్, గుర్రం మల్లికార్జున్,కర్నాటి మధు,పులిపాటి గణేష్ ఎన్నిక కాగా,గౌరవ సలహాదారులుగా కోట వెంకటయ్య,కోట అయోధ్య,నక్క మురళి నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని అన్నారు. తమపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి గ్రామ పెద్దలు నక్క చంద్రమౌళి, నక్క రవీందర్, గుర్రం శ్రీరాములు,భరతయ్య,బిక్షమయ్య,పున్న కోటేశ్వర్,కర్నాటి శ్రీహరి,గుర్రం వెంకటేశ్వర్లు,గణేష్,గోలి కృష్ణ, సంగెపు లక్ష్మణ్, మల్లేష్, పద్మశాలి సంఘ ప్రతినిధులు కమిటీ సభ్యులను అభినందించారు.



## రక్తదాన ఉద్యమంలో నల్లగొండ జిల్లా ఆదర్శం: గవర్నర్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో లోక్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్,ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ శివ్ ప్రతాప్ శుక్లా నల్లగొండ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చేపడుతున్న సేవలను ప్రత్యేకంగా అభినందించారు.నెక్లెస్ రోడ్‌లో నిర్వహించిన రక్తదాన అవగాహన ర్యాలీని ప్రారంభించిన గవర్నర్,అనంతరం లోక్ భవన్ సంస్కృతి హాల్‌లో జరిగిన మెగా రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రక్తదాతలకు మెమొంటోలు,ప్రశంసా పత్రాలు అందజేసి సత్కరించారు.జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ లయన్ డాక్టర్ గోలి అమరేందర్ రెడ్డి,యూత్ వాలంటీర్లు రక్తదాతలను ప్రోత్సహించారు.ఈసందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ రక్తదాన శిబిరాలు,సామాజిక సేవా కార్యక్రమాలు,మానవతా సేవల్లో రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. రక్తదాన ఉద్యమంలో నల్లగొండ జిల్లా ఆదర్శం అని పెర్కోన్నారు. సంస్థ కార్యకలాపాలను అభినందిస్తూ జిల్లా చైర్మన్‌తో పాటు మేనేజింగ్ కమిటీ సభ్యులను ప్రశంసించారు.డాక్టర్ గోలి అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర గవర్నర్,జిల్లా కలెక్టర్ ప్రోత్సాహంతో జిల్లాలో నిరంతరం రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.అవసరమైన వారికి సకాలంలో రక్తం అందించేందుకు రెడ్ క్రాస్ కృషి చేస్తోందని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి రక్తదాతకు రెడ్ క్రాస్ తరఫున కృతజ్ఞతలు, అభినందనలు తెలియజేశారు.

## యువకుడి అనుమానాస్పద మృతి



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** స్నేహితులు నిర్వహించిన వీకెండ్ పార్టీలో యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన కలకలం రేపింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో చోటుచేసుకుంది. కొయ్యలగూడెం గ్రామ పరిధిలో ఓ ఫామ్ హౌజ్‌లో నిర్వహించిన వీకెండ్ పార్టీలో యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ప్రైవేట్ 15 మంది ఉద్యోగుల వీకెండ్ సందర్భంగా కొయ్యలగూడెం సమీపంలోని ఓ ఫామ్ హౌస్‌కు వచ్చి వీకెండ్ పార్టీ నిర్వహించారు. రాత్రంతా సరదాగా గడిపిన అనంతరం ఆదివారం ఉదయం రాము అనుమానాస్పద స్థితిలో కనిపించగా అప్పటికే అతని మృతి చెందినట్లు తెలిసింది. మృతుడు శరీరంపై గాయాల ఆనవాలు కనిపిస్తున్నట్లు సమాచారం దీంతో పార్టీ సందర్భంగా ఏదైనా గొడవ జరిగిందా.. లేక మరే ఇతర కారణాలు ఉన్నాయని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.ఈ ఘటనపై సమాచారం అందుకున్న చౌటుప్పల్ పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. మృతదేహాన్ని చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్ట్ మార్టం నిమిత్తం భద్రపరిచారు. రాము మృతికి వెనుక అసలు కారణాలు ఏమిటన్న దానిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పార్టీకి హాజరైన వారిని విచారిస్తూ ఘటనకు దారి తీసిన పరిస్థితులపై ఆరా తీస్తున్నారు. రాము మృతి చెందిన వార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు స్నేహితులు కన్నీరు మున్నీరయ్యారు. కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడి ఎన్నిక



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండలంలోని చిన్న లక్ష్మాపూర్ గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామ కాంగ్రెస్ కమిటీలను అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చిన్న లక్ష్మాపూర్ గ్రామ శాఖ అధ్యక్షునిగా దూబల నవీన్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా రమావత్ నరేష్, మేడిపల్లి జగన్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా కీసర శేఖర్, సోషల్ మీడియా ఇంచార్జిగా మూడవత్ నర్సింహా, గ్రామ మహిళా కాంగ్రెస్ అధ్యక్షులుగా నరిగే లక్ష్మి లను మండల కాంగ్రెస్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చైతన్య మహేందర్రెడ్డి, కాంగ్రెస్ నాయకులు శంకర్ నాయక్, గ్రామ సర్పంచ్ కోమటి రెడ్డి సంతోష భాస్కర్ రెడ్డి, మమత, భాస్కర్ నాయక్, దేవురుప్పల ఐలయ్య, రాజారాం నాయక్, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గొర్ల కాపరి కొడారి సమ్మయ్య హత్య

గ్యుర్తుతెలియని వ్యక్తులు దాడి: అక్కడికక్కడే మృతి



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వేషాలపల్లిలో గొర్ల కాపరి కొడారి సమ్మయ్య (70) ను గుర్తుతెలియని దుండగులు హత్య చేసిన సంఘటన భూపాలపల్లి జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేషాలపల్లి గ్రామానికి చెందిన కొడారి సమ్మయ్య (70) వృత్తి గొర్ల కాపరి, రోజు మాదిరిగానే తన గొర్రెల మంద వద్ద ఏర్పాటు చేసుకున్న మంచంపై రాత్రి సమయంలో నిద్రిస్తున్నాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆయనపై దాడి చేసి తలపై తీవ్రంగా గాయపరచగా, ఈ ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి అన్న కొడారి కొము రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సంఘటన స్థలాన్ని పరిశీ లించి, అవసర మైన ఆధారాల ను సేకరించడంతో పాటు నిందితులను గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక దర్యాప్తు చేపట్టినట్లు భూపాలపల్లి పట్టణ ఎస్సై కె. పవన్ కుమార్ తెలిపారు.

# ముగిసిన వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం



**ప్రజాపక్షం/నర్సంపేట :** నర్సంపేట పట్టణంలోని గీతాంజలి డిజి ప్రైమరీ స్కూల్లో నిర్వహించిన వేసవి ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరం ఆదివారం తో ముగిసినట్లు వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెలక్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. వేసవి క్రికెట్ శిక్షణ శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేసిన ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల రోజులుగా నిర్వహించిన ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్న క్రీడాకారులకు అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో ఈ యొక్క శిక్షణ శిబిరాన్ని ప్రతిరోజు నిర్వహించేల హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ తో సంప్రదింపులు జరుపుతున్నామని నర్సంపేట ప్రాంతంలోని క్రీడాకారులు, క్రీడా రంగం అభివృద్ధికి ఎలాంటి సహాయ సహకారాలు అయినా అందిస్తానని క్రీడాకారులు ఇలాంటి శిక్షణ శిబిరాలను ఉపయోగించుకొని భవిష్యత్తులో క్రమశిక్షణ గల ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని నర్సంపేట ప్రాంతానికి, రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కల్పించే స్పోర్ట్స్ కోటా లోని 2 శాతం రిజర్వేషన్లు వినియోగించుకొని ప్రభుత్వ ఉద్యోగాలలో ఉపాధి పొందాలన్నారు. గత నెల రోజులుగా క్రికెట్ శిక్షణ శిబిరం నిర్వహించుకోవడానికి క్రీడ మైదానాన్ని అందించినటువంటి గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ డాక్టర్ వేములపల్లి సుబ్బారావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. శిక్షణ శిబిరాన్ని క్రమశిక్షణతో నిర్వహించిన కోచ్ నరేందర్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో గూడెపు బిక్షపతి, గుండేటి రవీందర్ గౌడ్ , కందుల స్వామి గౌడ్ , కబడ్డీ కోచ్ యాట రవికుమార్ ముదిరాజ్ , శివ కోటి , కిరణ్ , క్రీడాకారులు తదితరులు పాల్గోన్నారు.

# పాఠశాలల ఓపెనింగ్‌కు 'అమావాస్య' గండం!

తొలిరోజు హాజరుపై సందిగ్ధత...

నేటినుంచి తెరుచుకోనున్న పాఠశాలలు...

**ప్రజాపక్షం/నర్సింంహులపేట:** కొత్త విద్యా సంవత్సరానికి పాఠశాలలు ప్రారంభమయ్యే వేళ అమావాస్య తిథి రావడం చర్చనీయాంశంగా మారింది.తెలంగాణ ప్రభుత్వం పాఠశాలలు జూన్ 15నుంచి పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో అమావాస్య రావడం వల్ల కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను మొదటి రోజే పాఠశాలకు పంపించాడానికి వెనుకంజ వేస్తున్నారు.వాస్తవానికి పాఠశాలలను ముందుగా జూన్12న ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ తీవ్రమైనా ఎండల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రారంభ తేదీని జూన్15కు వాయిదా వేసింది. అయితే జూన్ 15అమావాస్య కావడంతో పాఠశాలల్లో తొలి రోజు హాజరు శాతం ఆశించిన స్థాయిలో ఉండకపోవచ్చనే అభిప్రాయాలు వ్యక్త మవుతున్నాయి. కానీ విద్యా నిపుణులు మాత్రం విద్యార్థుల విద్యాభ్యాసంలో ప్రతి రోజు ముఖ్యమని తొలి రోజు నుంచే తరగతులకు హాజరైతే కొత్త విద్యా సంవత్సరాన్ని సక్రమంగా ప్రారంభించాడానికి ఉపయోగపడుతుందని సూచిస్తున్నారు. మరోవైపు తల్లిదండ్రులు తమ కుటుంబ సాంప్రదాయాలు వ్యక్తిగత విశ్వాసాల ప్రకారం నిర్ణయాలు తీసుకునే ఆవకాశం ఉండగా విద్యార్థులు కొత్త పుస్తకాలు, యూనిఫార్ములు, టీచర్లతో కలసి విద్యా సంవత్సరాన్ని ఉత్సాహంగా ప్రారంభించేందుకు సిద్ధమవుతుండగానే అమావాస్య అంశం సామాజిక సాంప్రదాయ కోణంలో మాత్రమే చర్చకు వస్తోందని పలువురు పేర్కొంటున్నారు. ఏదేమైనప్పటికి విద్యా అనేది నిరంతర ప్రక్రియ సాంప్రదాయ విశ్వాసాలను గౌరవిస్తూ ప్రభుత్వ అధికారిక షెడ్యుల్‌ను అనుసరించడం ద్వారా విద్యార్థుల విద్యాభ్యాసానికి ఆటంకం లేకుండా చూసుకోవాలని విద్యానిపుణులు చెబుతున్నారు.

# రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలి: మంద భాస్కర్




**ప్రజాపక్షం/కేసముద్రం:** కేసముద్రం మున్సిపల్ కేంద్రంలో చేపట్టిన విస్తరణ పనులను వేగవంతం చేయాలంటూ ఆదివారం సిపిఐ మండల నాయకులు మంద భాస్కర్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంద భాస్కర్ మాట్లాడుతూ నత్తనడకన సాగుతున్న రోడ్డు విస్తరణ పనులతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, మున్సిపాలిటి అభివృద్ధిలో భాగంగా కోట్లాది రూపాయలు వెచ్చించి రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించినా కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యంతో పనులు నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు. రోడ్డుపై కంకర పోసి నెలలు గడుస్తున్నా ఎవరికీ పట్టింపు లేకపోవడంతో ప్రయాణీకులకు గాయాలు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని, రోడ్డుపై ప్రయాణం చేయాలంటేనే ప్రజలు జంకుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సైడ్ కాలువలను తొలగించడంలో అధికారులు చూపిన శ్రద్ధ తిరిగి నిర్మించడంలో లేదని విమర్శించారు. సైడ్ కాలువలు లేకపోవడంతో కురిసే వర్షాలకు ప్రజలు రోగాల బారిన పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు విస్తరణ పనుల జాప్యానికి అధికారుల నిర్లక్ష్యమా, లేక కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా అని ప్రశ్నించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కాంట్రాక్టర్, సంబంధిత అధికారులు చొరవ చూపి రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని, యుద్ధ ప్రాతిపదికన సైడ్ కాల్వల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ నాయకులు లైశెట్టి భాస్కర్, జన్ను రాజేందర్, ఎస్‌కె జిలాని, వెంకన్న, వీరన్న, పాష, సూర్యనాయక్, వీరన్న, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ రక్తదాత దినోత్సవం

# హనుమకొండకు 8 రాష్ట్ర స్థాయి అవార్డులు

**ప్రజాపక్షం/హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర రెడ్ క్రాస్ సొసైటీ ప్రకటించిన రాష్ట్ర స్థాయి రక్తదాన అవార్డుల్లో హనుమకొండ జిల్లా విశేష ప్రతిభ కనబరిచి మొత్తం 8 అవార్డులను కైవసం చేసుకుంది. స్వచ్ఛంద రక్తదానాన్ని ప్రోత్సహించడం, రక్తదాన శిబిరాల నిర్వహణ, అత్యధిక రక్త సేకరణ, రక్తదాతల భాగస్వామ్యం, సామాజిక సేవా కార్యక్రమాల్లో చేసిన విశిష్ట కృషికి ఈ అవార్డులు లభించాయి.ప్రపంచ రక్తదాత దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి. విజయ్ చందర్ రెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు అవార్డులను అందుకున్నారు.హనుమకొండ రెడ్ క్రాస్ రక్తకేంద్రం స్వచ్ఛంద రక్తదాన ఉద్యమాన్ని విస్తృతంగా ప్రోత్సహించడం, నాణ్యమైన రక్తసేవలు అందించడం, రక్త నిల్వలను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందింది. ఈ కృషికి గుర్తింపుగా "అత్యధిక రక్త సేకరణ చేసిన రక్తకేంద్రం" విభాగంలో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించింది. ఈ అవార్డు జిల్లాలోని వేలాది మంది స్వచ్ఛంద రక్తదాతలు, రక్తదాన శిబిరాలు నిర్వహించిన విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ శాఖలు, రెడ్ క్రాస్ సిబ్బంది, సామాజిక సేవకుల సమిష్టి కృషికి నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ, "రక్తదానం మహాదానం, ప్రాణదానం" అని పేర్కొంటూ ప్రతి ఆరోగ్యవంతుడు క్రమం తప్పకుండా స్వచ్ఛంద రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రక్త కొరత లేకుండా మరిన్ని రక్తదాన శిబిరాలు నిర్వహించాలని సూచించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చేపడుతున్న శాశ్వత సభ్యత్వ నమోదు కార్యక్రమాలను మరింత విస్తరించాలని, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని విపత్తు నిర్వహణ కార్యక్రమాలను బలోపేతం చేయాలని సూచించారు. జూనియర్ రెడ్ క్రాస్, యూత్ రెడ్ క్రాస్ కార్యక్రమాలను పాఠశాలలు, కళాశాలల్లో మరింత సమర్థవంతంగా అమలు చేసి యువతలో సేవాభావాన్ని పెంపొందించాలని పేర్కొన్నారు. హనుమకొండ రెడ్ క్రాస్ రక్తకేంద్రం, విద్యాసంస్థలు, ప్రభుత్వ శాఖలు, పోలీసు విభాగం, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సేవకులు, వేలాది మంది రక్తదాతల సమిష్టి కృషి ఫలితంగానే జిల్లాకు 8 రాష్ట్ర స్థాయి అవార్డులు లభించాయని గవర్నర్ అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ, హనుమకొండ జిల్లాకు రాష్ట్ర స్థాయిలో 8 అవార్డులు రావడం గర్వకారణమని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో ద్వితీయ స్థానం సాధించిన హనుమకొండ రెడ్ క్రాస్ రక్తకేంద్రాన్ని రాబోయే రోజుల్లో ప్రథమ స్థానంలో నిలిపేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో స్వచ్ఛంద రక్తదాన ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసి, రక్త కొరత లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గవర్నర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్ , డిజిపి లా అండ్ ఆర్డర్ మహేష్ మురళీధర్ భగవత్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి. విజయ్ చందర్ రెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు, పలు జిల్లాల రెడ్ క్రాస్ ప్రతినిధులు, అధికారులు స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.



**సంస్థల విభాగంలో రాష్ట్ర స్థాయి అవార్డులు**

స్వచ్ఛంద రక్తదాన శిబిరాల నిర్వహణలో విశేష కృషి చేసిన క్రింది సంస్థలు రాష్ట్ర స్థాయి అవార్డులను అందుకున్నాయి.ఎస్.ఆర్. యూనివర్శిటీ, హనుమకొండ వైస్ ఛాన్సలర్ డాక్టర్ మహేష్ కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్), వరంగల్ – ప్రొఫెసర్ కె. అశోక్ రెడ్డి,వాగ్దేవి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్, వరంగల్ – చందుపట్ల వాణి, చందుపట్ల విశ్వంభర రెడ్డి సంస్థలు యువతలో రక్తదానంపై అవగాహన పెంపొందిస్తూ, పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాలు నిర్వహించడం ద్వారా సమాజానికి విశిష్ట సేవలందిస్తున్నాయి.విశిష్ట సేవల విభాగంలో రాష్ట్ర స్థాయి అవార్డులు వరంగల్ పోలీస్ కమిషనరేట్, డాఫోడిల్స్ స్కూల్, హనుమకొండ డాక్టర్ నరేందర్ రెడ్డి రక్తదాన శిబిరాల నిర్వహణతో పాటు యువతలో సేవాభావం, రక్తదాన స్ఫూర్తిని పెంపొందించడంలో వీరి కృషి రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు అందుకుంది. వ్యక్తిగత విభాగంలో రాష్ట్ర స్థాయి అవార్డులు అత్యధిక సార్లు స్వచ్ఛందంగా రక్తదానం చేసినందుకు జి. రామకృష్ణ బి. శిరీష్ కుమార్ రాష్ట్ర స్థాయి అవార్డులను అందుకున్నారు.

# మధ్యాహ్న భోజన మెనూ పాటించాలి

జిల్లా విద్యాశాఖాధికారి సత్యనారాయణమూర్తి




**ప్రజాపక్షం/మహబూబాబాద్:** పాఠశాలల్లో మధ్యాహ్న భోజన మెనూను తప్పక పాటించాలని మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి సత్యనారాయణ మూర్తి సూచించారు. పాఠశాలలు పున ప్రారంభం కానున్న సందర్భంగా మహబూబాబాద్ జిల్లాలోని కొత్తగూడ మండలంలోని పాఠశాలలను ఆయన అకస్మికంగా తనికి చేశారు. ఈ సందర్భంగా కొత్తగూడ మండలంలోని నిర్మాణంలో ఉన్న భవిత సెంటర్‌ను సందర్శించి నిర్మాణంలోని లోపాలను సవరించవలసిందిగా ఎంఇఓకి తగు సూచనలు చేశారు. ఎంపిపిఎస్ బూరుగు గుంపు, ఎంపిపిఎస్ వేలుబెల్లి పాఠశాలల ను సందర్శించి పాఠశాను యొక్క ఆవరణను ,టాయిలెట్‌లను పరిశీలించారు. వంట పాత్రలను శుభ్రముగా కడగాలని మధ్యాహ్న భోజన విషయంలో మెనూను పాటిస్తూ చాలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డీఈఓ గారి తో పాటు సిఎంఓ వంగ సురేష్, ఎంఇఓ లక్ష్మీ నారాయణ, వేలుబెల్లి సర్పంచ్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రక్తదానం.. ప్రాణదానంతో సమానం

రక్తదానంలో యువత స్వచ్ఛందంగా పాల్గొనాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** రక్తదానం ప్రాణదానముతో సమానమని, మానవత దృక్పథంతో రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు. ఆదివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ప్రపంచ రక్తదాన దినోత్సవ సందర్భంగా ఐటీ మాస్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రక్తదానం అత్యున్నతమైన మానవతా సేవ అని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రమాద బాధితులు, శస్త్రచికిత్సలు చేయించుకునే రోగులు, గర్భిణీలు, తల సేమియా ఇతర దీర్ఘకాలిక రోగులకు రక్తం ఎంతో అవసరమవుతుందని పేర్కొన్నారు. ప్రతి ఆరోగ్యవంతమైన వ్యక్తి స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణాలను కాపాడేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం వల్ల దాత ఆరోగ్యానికి ఎలాంటి హాని ఉండదని రక్తదానం పై అపోహలు వద్దని అవగాహన కల్పించాలని అన్నారు. నిర్దిష్ట వ్యవధిలో రక్తదానం చేయడం ద్వారా సమాజానికి అమూల్యమైన సేవ చేసిన వారవుతారని తెలిపారు. యువత సామాజిక బాధ్యతతో రక్తదాన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని మానవత్వాన్ని చాటాలని సూచించారు. ఒక్క యూనిట్ రక్తం ముగ్గురు వ్యక్తుల ప్రాణాలను కాపాడుతుందని తెలిపారు. ప్రతి ఆరోగ్యవంతమైన వ్యక్తి ఏడాదికి మూడు నాలుగు సార్లు స్వచ్ఛందంగా రక్తదానం చేయవచ్చు అని అన్నారు. రక్తదానం వల్ల దాత ఆరోగ్యానికి ఎలాంటి నష్టం లేదన్నారు. కొత్త రక్తం ఉత్పత్తి అవుతుంది, శరీరానికి మేలు జరుగుతుందని వివరించారు. యువత ముందుకు వచ్చి సామాజిక బాధ్యతతో ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని సూచించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. శిబిరంలో మొత్తం 200 మందికి పైగా యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు విస్లావత్ దేవన్, నాయకులు పిప్పాల రాజేందర్, చల్లూరి మధు క్యాథరాజు సాంబమూర్తి, నాగపూరి సమ్మయ్య, దాట్ల శ్రీనివాస్, తోట రంజిత్, సుభాష్, స్థానిక ప్రజాప్రతినిధులు, ఐటీ మాస్టర్ సభ్యులు, కళాశాల విద్యార్థులు, యువకులు, రక్తదాతలు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తండాల్లో కార్డన్ సెర్చ్...

భారీగా బెల్లం పానకం, గుడుంబా స్వాధీనం..




**ప్రజాపక్షం/నర్సింంహులపేట:** మండలంలోని గోపతండా, వస్రంతండా, మూడ్ తండా, జగ్గు తండా, లాలీ తండాలల్లో ఆదివారం ఏకకాలంలో పోలీసులు కార్డాన్ సెర్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ఆదేశాల మేరకు తొర్రూర్ డీఎస్పీ కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో సీఐ గణేష్ పర్యవేక్షణలో ఈ కార్డాన్ సెర్చ్ తనిఖీలు జరిగాయి. తనిఖీల్లో భాగంగా 550లీటర్ల బెల్లం పానకం, 32 లీటర్ల నాటుసారయి, 50 కేజీల నల్లబెల్లం, 3 కేజీల పట్టికను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా గుడుంబా తయారీ నిల్వలకు సంబంధించిన వస్తువులను సీజ్ చేసి సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అక్రమ మద్యం తయారీ, విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిర్దాక్షిణ్యంగా చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ప్రజలు కూడా ఇలాంటి కార్యకలాపాలపై సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నర్సింంహులపేట ఎస్సై బానోతు వెంకన్న, దంతాలపల్లి, పెద్దవంగర, తొర్రూర్ ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పరకాలలో విజిలెన్స్ దాడులు...

150 లీటర్ల స్పీడ్ పారాక్వాట్ పట్టివేత

నిషేధిత కలుపు మందు స్వాధీనం



**ప్రజాపక్షం/పరకాల :** పరకాల పట్టణంలోని ఓ ఎరువులు, పురుగుమందుల దుకాణంలో నిషేధిత కలుపు మందును విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని లక్ష్మీ ఏజెన్సీలో నిల్వ ఉంచిన సుమారు 150 లీటర్ల స్పీడ్ పారాక్వాట్ (పారాకుట్) మందును అధికారులు తనిఖీల సందర్భంగా గుర్తించి పట్టుకున్నట్లు సమాచారం. భూమి సారంపై ప్రతికూల ప్రభావం చూపడంతో పాటు రైతుల ఆరోగ్యానికి హానికరంగా మారే అవకాశం ఉందన్న కారణాలతో ప్రభుత్వం ఈ మందు విక్రయాలు, వినియోగంపై నిషేధం విధించింది. అయినప్పటికీ కొందరు వ్యాపారులు నిబంధనలను ఉల్లంఘిస్తూ రహస్యంగా విక్రయాలు కొనసాగిస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించినట్లు తెలిసింది.పట్టణంలోని ఇతర ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లోనూ సమగ్ర తనిఖీలు చేపడితే మరింత పరిమాణంలో నిషేధిత మందులు బయటపడే అవకాశం ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఘటనపై అధికారులు విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం.

# ప్రైవేట్ ఫీజు నియంత్రణ చట్టం వెంటనే అమలు

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ డిమాండ్




**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ప్రైవేటు పాఠశాలలో ఫీజు నియంత్రణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోతుకు ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. భూపాలపల్లి పట్టణంలోని స్థానిక రావి నారాయణరెడ్డి భవన్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేండ్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ రౌండ్ టేండ్ సమావేశానికి ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోతుకు ప్రవీణ్ కుమార్ హాజరై మాట్లాడుతూ, ప్రైవేటు పాఠశాలలో ఫీజు నియంత్రణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని, ప్రభుత్వ నియమ నిబంధనలను పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు పాఠశాలలో ఫీజులు, టీచర్ క్వాలిఫికేషన్ నోటీస్ బోర్డులో పెట్టాలని కోరారు. ప్రైవేటు పాఠశాలలో పుస్తకాలు, యూనిఫామ్, టై బెల్టు అమ్మకాలు చేయకూడదని నిబంధన ఉన్నప్పటికీ కూడా ధనార్జనయ ధ్యేయంగా విచ్చలవిడిగా అమ్మకాలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలను వెంటనే సీజ్ చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. జయశంకర్ భూపాలపల్లి కేంద్రంలో బిఈడి ఇంజనీరింగ్ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేయాలని కోరారు. వెంటనే జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ చొరవ చూపి భూపాలపల్లి పట్టణ కేంద్రానికి డిగ్రీ కళాశాల తీసుకురావాలని కోరారు. జిల్లాలో విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేనియెడల పెద్ద ఎత్తున విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు ఉధృతం చేస్తామని ప్రవీణ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజ్ కుమార్, టిఆర్ఎస్వి జిల్లా అధ్యక్షుడు దిలీప్, బొడ్డు స్మరన్, జడల రాజేశ్వరి, పోతుల పవన్, రాజుల శివ, కోనూరి భగత్, పొన్నగంటి రాజేష్, వాసం అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదల ఇంటి స్థలాల కోసం సిపిఐ భూపోరాటాలు

నూతన భూ పోరాట కేంద్రంలో సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్ సారథి రెడ్డి




**ప్రజాపక్షం/మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అనంతారం మోడల్ స్కూల్ పక్కనగల ప్రభుత్వ భూమిలో నేడు సిపిఐ ఆధ్వర్యంలో జెండాలు పాతి వందలాది మంది ఇల్లు లేని నిరుపేదలు ఇంటి స్థలాల కై భూ పోరాటం నిర్వహించారు. ముందుగా గుడిసె వేసి సిపిఐ జెండాను గుడిసెకు కట్టి అనంతరం సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారథి రెడ్డి మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో వేలాదిమంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసి, నిరుపేద కుటుంబాలు ఇండ్ల కిరాయి కట్టలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నిరుపేదల ఇంటి స్థలాల కోసమే సిపిఐ భూ పోరాటం నిర్వహిస్తోందని అన్నారు. ఈ జిల్లా కేంద్రంలో ఎన్నో ఇండ్లుగా 20 ప్రభుత్వ భూముల్లో కాలనీలు నిర్మించుకుని వేలాదిమంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసి, నిరుపేదలకు ఇంటి స్థలాలు పంచామని ఆయన తెలిపారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని మోసం చేసిందని ఒకరికి కూడా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వలేదని ఆరోపించారు. నూతనంగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటి స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని పూర్తిస్థాయిలా ఇవ్వలేకపోయారని అన్నారు. ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకొని ఉంటున్న నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇంటి నెంబర్లు వెంటనే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. పేద ప్రజలకు అండగా సిపిఐ భూ పోరాటాలు ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తుందని బి అజయ్ సారథి రెడ్డి తెలిపారు. ఈ భూ పోరాట కార్యక్రమంలో పెరుగు కుమార్,నవీన్, వెంకన్న,సాంబలక్ష్మి, నర్రా శ్రావణ్, వెలుగు శ్రావణ్, ఆబోతు అశోక్, కేదాసు రమేష్, మంద శంకర్, ఎర్రోజు పద్మ, రాగం మల్లయ్య పాల్గొన్నారు.

# ధ్యానోత్సవాలలో పాల్గొనేందుకు తరలివెళ్ళిన 9వ వార్డు ప్రజలు

**ప్రజాపక్షం/ములుగు:** ములుగు జిల్లా కేంద్రంలో గల తొమ్మిదవ వార్డు కౌన్సిలర్ గండ్రకోట వాణి కుమార్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రామచంద్ర మిషన్ హార్ట్ ఫుల్ నెస్ సంస్థ ప్రధాన కేంద్రంగా 2వేల ఎకరాలలో 1,20,000 మంది ఒకేసారి ధ్యానం చేసే విధంగా నిర్మించిన కన్హా శాంతివనంలో మెడిటేషన్ చేయు నిమిత్తం 45 మంది కృష్ణా కాలనీ వాసులను 2 రోజుల ధ్యానోత్సవాలలో పాల్గొనడం కొరకై వారు తరలివెళ్లారు. ములుగు ఒక సంవత్సర కాలం నుండి రామచంద్ర మిషన్ ద్వారా యోగ ధ్యానం అనే సత్సంగం, ములుగు ప్రజలకు హార్ట్ ఫుల్ నెస్ జోనల్ కోఆర్డినేటర్ మాధవి, జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్‌లచే నిర్వహించబడుతుంది. ఈ ధ్యానోత్సవం ప్రోగ్రాం వెళ్ళుటకు గాను ఉచిత బస్సు సౌకర్యంను సాధన స్కూల్ కరస్పాండెట్ సురేందర్ రెడ్డి ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించారు.

# ఎమ్మెల్యే గండ్ర కృషితోనే కారుణ్య నియామకాలు



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** సింగరేణి లో కారుణ్య నియామకాల ప్రక్రియలో తమ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి మా సమస్యను పరిష్కరించడంలో ప్రత్యేక చొరవ చూపిన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుకు కారుణ్య నియామకాలు పొందిన అభ్యర్థులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సింగరేణి కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు పొందిన భూపాలపల్లి ఏరియాలో సుమారు 60 మంది అభ్యర్థులు గండ్ర సత్యనారాయణ రావు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ, కారుణ్య నియామకాల ప్రక్రియలోతమ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి, ప్రభుత్వంతో మాట్లాడి తమకు న్యాయం జరిగేలా ఎమ్మెల్యే నిరంతరం కృషి చేశారని పేర్కొన్నారు. తమ పక్షాన బలంగా నిలిచి ఉద్యోగాల సాధనకు తోడ్పడినందుకు ఎమ్మెల్యేకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు అభినందనలు తెలియజేస్తూ, విధుల్లో నిబద్ధతతో పనిచేసి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.

